

మరిన్ని కథనాల కోసం యూట్యూబ్‌లో ప్రసారమవుతున్న మీ SREECHAKRA NewsTVని వీక్షించవచ్చు. ప్లీజ్, సబ్‌స్క్రైబ్, లైక్.


https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 11 | సంచిక 62 | కర్నూలు | శుక్రవారం 10-04-2026

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi



# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం

21 నెల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం
జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి
విభజన కన్నా జగన్ వల్లనే ఏపి నష్టపోయింది
'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు
బాపట్ల జిల్లా సూరేపల్లిలో పట్టా పుస్తకాలు అందచేత



బాపట్ల,ఏప్రిల్9(: ప్రజలకు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని..దానిని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఎన్నికల్లో చెప్పనివి కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని సీఎం విమర్శించారు.గురువారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో పర్యటించిన సీఎం.. 'మీ భూమి–మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేదన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయని.. దారిలో పెడుతున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ప్రజల భూములపై కన్నేశారని.. ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని మండిపడ్డారు. 'పట్టా పుస్తకంపై జగన్ ఫొటో వేసుకున్నారు.. ఆస్తి మీది.. ఫొటో ఆయనది' అని విమర్శించారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతిపోయిందని సీఎం అన్నారు. నూటికి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతినెలా 9న ఒక ప్రాంతంలో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని.. జులై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి కోటి 12లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని వెల్లడించారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రికార్డులు మారుస్తున్నామని చెప్పారు. రైతులకు ఇస్తున్న పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరన్నారు. కరెన్సీకి వాడే టెక్నాలజీని పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. 22ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకొస్తామన్నారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు ఆదర్శం కాకూడదని సీఎం అన్నారు. సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూమి నుంచి వచ్చే ఆదాయమే కాకుండా.. సముద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేసిందని.. ప్రతి దానిపైనా అప్పులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోయిందన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను డెవలప్ చేశానని.. ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్నీ ఆలోచించే రాజధానికి అమరావతి పేరు పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రజా రాజధాని.. దేవతల రాజధాని.. అమరావతి' అని పేర్కొన్నారు. ఆనాడు బాబాయ్‌ని చంపి.. ఆ నేరం తనపై వేశారని సీఎం మండిపడ్డారు. అమరావతిపై జగన్ కక్షగట్టారని.. ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియోలు తీశారని, లాఠీలతో కొట్టించారని గుర్తుచేశారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచిందన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ఒక్కడే సైకో అనుకున్నామని.. వైసీపీ నేతలంతా సైకోలుగా మారారని వ్యాఖ్యానించారు. 'నీలాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదు' అని స్పష్టం చేశారు.

## సూరేపల్లిలో ప్రభుత్వ స్టాళ్ల పరిశీలన

రాజముద్రతో కూడా పట్టా పాస్ పుస్తకాలు పంపిణీ

బాపట్ల,ఏప్రిల్9(: బాపట్లలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. గురువారం ఉదయం భట్టిప్రోలు మండలం సూరేపల్లి చేరుకున్న సీఎం... అక్కడ ఏర్పాటు చేసిన గ్రామసభకు హాజరయ్యారు. ప్రభుత్వ స్టాళ్లను సందర్శించారు. 'మీ భూమి – మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు ముఖ్యమంత్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్య ప్రసాద్, పార్థసారథి, ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు తదితరులు పాల్గొన్నారు. అమరావతి గెజిట్ వచ్చాక సీఎం మొదటి పర్యటనగా బాపట్లకు వచ్చారని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఒక్క ఛాన్స్ అంటూ జగన్ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని నాశనం చేశారని విమర్శించారు. ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం చంద్రబాబు అమలు చేస్తున్నారని తెలిపారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు వేమూరు నియోజకవర్గం అభివృద్ధి చెందిందని.. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆగిన అభివృద్ధి ఇప్పుడు మళ్లీ పట్టాలెక్కిందన్నారు. సీఎం ఆలోచనల మేరకు ఉద్యాన పంటలు పెంచడానికి కృషి చేస్తున్నామని చెప్పారు. మూత పడిన జంపని షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేయాలని.. ఈ ప్రాంతంలోని కాలువలు ఆధునీకరించాలని సీఎంను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు కోరారు.తాను లోక్‌సభ ప్యానెల్ స్పీకర్‌గా ఉన్నప్పుడు అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందిందని బాపట్ల ఎంపీ టి.కృష్ణ ప్రసాద్ అన్నారు. అన్ని పార్టీలు అమరావతి జై అంటే ఒక్క పార్టీ మాత్రమే వ్యతిరేకించిందని తెలిపారు. వైసీపీ అమరావతి బిల్లును వ్యతిరేకిస్తూ సభ నుంచి బాయ్‌కాట్ చేసిందని విమర్శించారు. జగన్ వల్ల రాష్ట్ర అభివృద్ధి పాతికేళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. చంద్రబాబు వల్లే మళ్లీ అమరావతి నిలబడిందని ఎంపీ తెలిపారు.

## వ్యతిరేక వార్తలు వస్తే దాడులు చేయడం సరికాదు

శాంతియుత నిరసనలతో ఖండించాలి
మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

చిత్తూరు,ఏప్రిల్9(: పత్రికల్లో, మీడియాల్లో ఏవైనా అసత్య ప్రసారాలు వస్తే వాటిపైన శాంతియుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉందని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. అలాగే వాటికి ఖండనలు ఇచ్చి తమ నిరసనలు తెలప వచ్చన్నారు. అలా కాకుండా మీడియాపై భౌతిక దాడులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పేర్కొన్నారు. మీడియా స్వేచ్ఛకు విఘాతం కల్పించే చర్యలకు పాల్పడటం ఏ రాజకీయ పార్టీలకైనా తగదని అన్నారు. పత్రికా స్వేచ్ఛపై భౌతిక దాడులకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ అయినా సరే ఆ చర్యలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. గురువారం చిత్తూరులోని ఎన్పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళ కళాశాల స్నాతకోత్సవానికి వెంకయ్య నాయుడు హాజరయ్యారు. కళాశాల ఆవరణలో చిత్తూరు మాజీ ఎంపీ చంగల్రాయ నాయుడు సహకారంతో నూతనంగా నిర్మించిన మహిళ వసతి భవనానికి ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. మాతృభాషను మరిస్తే అమ్మను మరిచినట్లేనని వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. జన్మనిచ్చిన తల్లి ఊరు, దేశాన్ని ఎవరు మరువకూడదని చెప్పుకొచ్చారు. విద్యాంస్థలు యువత సోషల్ మీడియా ఊబిలో పడవద్దని సూచించారు. మనిషి జీవన ప్రమాణం మెరుగుపడాలంటే అందుకు అనుగుణంగా ఆహారపు అలవాట్లను కొనసాగించడం మంచిదని అన్నారు. విద్యార్థులకు మొదటి ప్రాధాన్యం చదువుతోపాటు ఆటలకు ఇవ్వాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆరోగ్యం కోసం తీసుకువచ్చిన యోగా కార్యక్రమాన్ని ప్రపంచ దేశాలు స్వాగతించాయని.. అమలు చేయడానికి శ్రీకారం చుట్టాయని ప్రస్తావించారు. తాను రాజకీయ వారసత్వానికి వ్యతిరేకినని.. కానీ సేవా కార్యక్రమాలు కొనసాగించే కుటుంబాల వారసత్వాన్ని ప్రోత్సహిస్తానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## దేశమంతా అమరావతికి ఓకే ..జగన్ మాత్రం నో

జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అనగాని

బాపట్ల,ఏప్రిల్9: ప్రపంచంలో తెలుగువారంతా గర్వించే నగరం అమరావతి అని ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ వ్యాఖ్యానించారు. దేశంలోని అన్ని పార్టీలు అమరావతినే రాజధానిగా కావాలన్నారని పేర్కొన్నారు. ఒకే ఒక్క వైసీపీ మాత్రం అమరావతిని వ్యతిరేకిస్తోందని ధ్వజమెత్తారు. రాజధాని రైతుల పాదయాత్ర ఈ ప్రాంతం గుండా వెళ్లిందని చెప్పుకొచ్చారు. అప్పుడు రైతులకు తాము మద్దతిచ్చామని అన్నారు. గురువారం బాపట్ల జిల్లాలోని భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మంత్రి అనగాని హాజరై మాట్లాడారు. జగన్ హయాంలో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌తో గందరగోళం



చేశారని ఆగ్రహించారు. జగన్ ఫొటోతో ఉన్న పాస్ పుస్తకాలు మనకు అవసరమా అని ప్రశ్నించారు. రైతుల భూములను 21ఏ లో చేర్చి ఇబ్బందులకు గురి చేశారన్ని ÷ర్ అయ్యారు. కూటమి అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేశామని ప్రస్తావించారు. రైతులకు ఇబ్బంది లేకుండా పాసుపుస్తకాలు ఇస్తున్నామని చెప్పారు. వైసీపీ హయాంలో సరిహద్దు రాళ్లపై జగన్ బొమ్మలు వేశారని ఎద్దేవా చేశారు. రైతులు భూమిని ఆత్మగౌరవంగా భావించారని.. అందుకే కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని అన్నారు. తుగ్లక్ పార్టీని మరోసారి అధికారంలోకి రాకుండా జనం చూడాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు.

## మావిగన్ పేరుతో మరో నాటకం

ఇది చెబితేనే జనం నవ్వుకుంటున్నారు
జగన్ తీరుపై మండిపడ్డ హోంమంత్రి అనిత



ఏలూరు,ఏప్రిల్9మావిగన్' పేరు ఎత్తితే జనం నవ్వుకుంటున్నారని హోం మంత్రి అనిత వ్యాఖ్యలు చేశారు. అమరావతిపై అక్కసుతో ఇలా చేస్తున్నారని, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై హోం మంత్రి విరుచుకుపడ్డారు. 'గత వైపీపీ హయాంలో కనీసం ఒక ఫైర్ ఇంజన్ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. తప్పు చేసిన వారి విషయంలో చట్ట ప్రకారమే చర్యలు తీసుకుంటామన్నారు. అవగాహన లేని వాళ్ళు గతంలో ఇష్టానుసారంగా వ్యవహరించి కోర్టుల నుంచి మొట్టికాయలు వేయించుకున్నారని తెలిపారు. విజ్ఞత కలిగిన నాయకులు మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఆధ్వర్యంలో అలాంటి తప్పులు చేయదలుచుకోలేదని హోం మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఏదైనా చట్ట ప్రకారం చేయడమే తప్ప ఎక్కడా ఉదాసీనతగా వ్యవహరించదని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీస్ వ్యవస్థకు అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఉన్నట్లు హోంమంత్రి అనిత వెల్లడించారు.

## వైఎస్ మరణం వేళ ..సిఎం పదవి కోసం ఎత్తులు

ఆనాడు సంతకాల సేకరణలో జగన్ బిజీ
బొత్స కూడా వైఎస్ మృతిపై అనుమానించారు
ఒక్క అవకాశం అంటూ రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారు
జగన్ తీరుపై మండిపడ్డ మంత్రి అచ్చన్నాయుడు



అమరావతి,ఏప్రిల్9: దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి చనిపోయిన సమయంలో జగన్ ఎక్కడ ఉన్నారో చెప్పాలని ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. అమరావతిలోని సచివాలయంలో మంత్రి అచ్చెన్నాయుడు మీడియా సమావేశంలో మాట్లాడారు. ఓ వైపు వైఎస్ ఆచూకీ తెలియక అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం పాకులాడుతారా? అని ప్రశ్నించారు. ఏం జరిగిందో నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాల సేకరణ చేస్తారా? అని విమర్శించారు. అప్పుడు రిలయన్స్ ఏజెన్సీలపై దాడి చేయించారు. మళ్లీ అదే రిలయన్స్‌ను మంచి చేసుకుని రాజ్యసభ స్థానాలిచ్చారు. చాలామంది సీనియర్ నాయకులు అనేక రకాలుగా మాట్లాడారు. వైఎస్ మృతి వెనుక జగన్ హస్తం ఉందని సాక్షాత్తూ బొత్సనే మాట్లాడారు. సభ్య సమాజంలో ఎవరూ ఇలాంటి పనులు చేయరని అనుకున్నాం. ఒక సైకోకు పదవీ వ్యామోహం వస్తే.. ఆ పదవి కోసం ఏమైనా చేస్తారు. తండ్రి మరణాన్ని సానుభూతిగా మలచుకుని ఎలా ప్రవర్తించారో చూశాం. తండ్రి మరణం నిర్ధరణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు ఎలా సేకరించారో చూశాం అని అచ్చెన్నాయుడు ఘాటుగా విమర్శించారు. 2019 ఎన్నికల్లో ఒక్క అవకాశం అని అధికారంలోకి వచ్చి రాష్ట్రంలో విధ్వంసం సృష్టించారని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రంపై జగన్‌కు ఎందుకింత కక్ష అని ప్రశ్నించారు. ఎన్డీఏపై అచంచల విశ్వాసంతో ప్రజలు అధికారం ఇచ్చారని తెలిపారు. 22 నెలల్లోనే కేంద్రం సాయంతో రాష్ట్రాన్ని గాడిలో పెట్టామని చెప్పారు. 2004లో రాజశేఖర్ రెడ్డి సీఎం అయ్యారని... నాడు వారి ఆర్థిక పరిస్థితి ప్రతి ఒక్కరికీ తెలుసన్నారు. వైఎస్సార్‌ను జగన్ మానసిక క్షోభకు గురిచేసినట్లు చెప్పారు. వైఎస్ చనిపోయినప్పుడు జగన్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. 'వైఎస్సార్ ఆచూకీపై అందరూ ఆందోళన చెందుతుంటే సీఎం పదవి కోసం జగన్ పాకులాడతారా? ఏం జరిగిందో నిర్ధారణ కాకముందే సీఎం పదవి కోసం సంతకాలు సేకరిస్తారా? ఇతర రాష్ట్రాల్లో జగన్ ఉండాల్సిన అవసరం ఏంటి?' అంటూ మంత్రి ప్రశ్నల వర్షం కురిపించారు.బాబాయిని కిరాతకంగా చంపింది జగన్ కాదా అని మంత్రి నిలదీశారు. తల్లి, చెల్లిని రోడ్డున పడేసిన విషయం గుర్తులేదా అని ప్రశ్నించారు. పదవి గురించి తప్ప.. జగన్‌కు మరో ఆలోచన లేదని విమర్శించారు. వైఎస్ మృతిలోనూ జగన్ పాత్ర ఉందన్న అనుమానాలున్నాయని తెలిపారు. సైకోకు పదవి ఇస్తే ఎలా ఉంటుందో జగన్ పాలన చూస్తే తెలుస్తుందన్నారు.

# సంపాదకీయం

## మతమా... విశ్వాసమా....

దేశవ్యాప్తంగా ఎంతో ఆసక్తిని రేకెత్తిస్తున్న శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయంలో మహిళల ప్రవేశంపై సుప్రీంకోర్టులో కీలక విచారణ కొనసాగుతోంది.'శబరిమలలో స్త్రీల ప్రవేశం' అంశంపై జరుగుతున్న విచారణ సందర్భంగా బుధవారం సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఆచారాల్లో ఏది మూఢనమ్మకమో, కాదో నిర్ణయించే అధికారం, హక్కు న్యాయస్థానానికి ఉందని పేర్కొంది.న్యాయమూర్తులు చట్టం విషయంలో మాత్రమే నిపుణులు, మత విషయాల్లో కాదు. కాబట్టి న్యాయస్థానాలు మత ఆచారాల విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేవు' అన్న కేంద్ర ప్రభుత్వ వాదనకు ప్రతిస్పందనగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసిందిసుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్? సూర్యకాంత్? నేతృత్వంలో, 9 మంది న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం శబరిమల కేసును విచారణ చేస్తోంది. ఈ ధర్మాసనంలో జస్టిస్? బి.వి. నాగరత్న, జస్టిన్? ఎం.ఎం. సుందరేశ్?, జస్టిన్? అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్? అరవింద్? కుమార్?, జస్టిస్? అగస్టిన్? జార్జ్? మాసిహ్?, జస్టిస్? ప్రసన్న బి.వరాలే, జస్టిస్? ఆర్? మహదేవన్?, జస్టిస్? జోయ్? మాల్య బాగ్చీ ఉన్నారు. ఈ బెంచ్ ఆధ్వర్యంలో కేరళలోని శబరిమల ఆలయంతో సహా, వివిధ మత ప్రదేశాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై, అలాగే వివిధ మతాల్లో ఉన్న స్త్రీ మత స్వేచ్ఛ పరిధిపై విచారణ జరుగుతోంది కేరళలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల వేళ ఈ విచారణ రాజకీయంగా కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ధర్మాసనంలో జస్టిస్‌లు బీవీ నాగరత్నం, ఎంఎం సుందరేష్, అహసానుద్దీన్ అమానుల్లా సహా తొమ్మిది మంది న్యాయమూర్తులు ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు బలంగా వినిపించారు. శబరిమల ఆలయానికి సంబంధించి మహిళల ప్రవేశంపై ఉన్న ఆంక్షలు పూర్తిగా మతపరమైన విశ్వాసాలకు సంబంధించినవని ఆయన పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 25వ అధికరణం కల్పించిన మత స్వేచ్ఛను ప్రస్తావిస్తూ మతపరమైన ఆచారాలు ప్రజలకు భావాలకు, నైతికత, ఆరోగ్యం, వంటి అంశాలకు భంగం కలిగించినప్పుడు మాత్రమే న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని ఆయన వాదించారు. మతపరమైన గ్రంథాలను అర్థం చేసుకోవడం, అవి ఏవీ నిర్దేశిస్తున్నయో నిర్ణయించడం న్యాయసమీక్ష పరిధిలోకి రాదని, దీనికి ఆధ్యాత్మిక మతపరమైన ఆచారం అనేది నిర్ణయించడానికి న్యాయస్థానాలు ప్రయత్నించడం సరైనది కాదని ఆయన వాదించారు. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్? మెహతా, "ఒక ఆచారం మూఢనమ్మకమని కోర్టు ఎలా నిర్ణయిస్తుంది? ఒక వేళ అది మూఢనమ్మకమని భావించినప్పటికీ, దానిని నిర్ధరించాల్సింది కోర్టు కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్? 25(2)(బి) ప్రకారం చట్టసభలు (లెజిస్లేచర్?)? మాత్రమే సంస్కరణ (రిఫార్మ్? లా) చట్టాలను తీసుకురావాల్సి ఉంటుంది. ఎలా అంటే, ఒక నిర్దిష్ట ఆచారం మూఢనమ్మకం అని, దానికి సంస్కరణ అవసరమని శాసనసభలు చెప్పవచ్చు. చేతబడి లాంటి ఆచారాలను నిరోధించడానికి ఇప్పటికే అనేక చట్టాలు ఉన్నాయి" అని పేర్కొన్నారు.2018 నాటి శబరిమల తీర్పులో మహిళల ప్రవేశానికి అస్పృశ్యత కిందకు వస్తుందని అప్పటి ధర్మాసనం చేసిన వ్యాఖ్యలపై తుషార్ మొహతా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ, ఒక మహిళను నెలలో మూడు రోజులు అంటరాని వ్యక్తిగా చూసి, నాలుగో రోజు ఆమె అస్పృశ్యురాలు కాదని చెప్పడం సాధ్యమేనా అని ప్రశ్నించారు. అయితే మెహతా దీనికి సమాధానం ఇస్తూ శబరిమల విషయంలో ఆంక్షలు కేవలం వయసు ఆధారంగానే ఉన్నాయని, ఇది రుతక్రమంతో ముడిపడి లేదని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అన్ని ఇతర అయ్యప్పస్వామి దేవాలయాల్లో ఇన్ని వయసుల మహిళలకు ప్రవేశం ఉందని, శబరిమల విషయంలో ఉన్న ఆంక్షలు ఒక ప్రత్యేక సందర్భం అని ఆయన వివరించారు. ఒక వేళ ఏదైనా అశాస్త్రీయమైన ఆచారం ఉంటే, దానిని పరిష్కరించే బాధ్యత శాసనసభలకే ఉంటుందని కేంద్రం వాదించింది. దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ, న్యాయస్థానాలు సైన్స్ రంగంలో నిపుణులు కాకపోయినప్పటికీ, ఎవిడెన్స్ యాక్ట్ ప్రకారం నిపుణులు అభిప్రాయాలను సమీక్షించే అధికారం కోర్టులకు ఉంటుందని పేర్కొన్నారు. ఒక సామాజిక రుగ్మతను మతపరమైన ఆచారంగా ముద్రవేసినప్పుడు అది నిజంగా మతపరమైన అచారామా లేక సామాజిక దురాచారమా అని చెప్పే హక్కు కోర్టుకు ఉంటుందని ధర్మాసనం వ్యాఖ్యానించింది. భారతీయ సమాజం మహిళలను ఎప్పుడూ గౌరప్రదమైన స్థానంలో ఉంచిందని, మనం దేవతలను పూజిస్తామని మెహతా ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాష్ట్రపతి నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తుల వరకు మహిళలు అత్యున్నత పదవులను అలంకరించారని, కాబట్టి ఇక్కడ పితృస్వామ్య భావజాలాన్ని ఆపాదించవద్దని ఆయన కోరారు. 2018 సెప్టెంబర్?లో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం 4:1 మెజారిటీతో శబరిమల ఆలయంలోకి 10 నుంచి 50 ఏళ్లలోపు మహిళల ప్రవేశంపై ఉన్న నిషేధాన్ని ఎత్తివేసింది. మహిళ ప్రవేశంపై నిషేధం ఉండడం రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొంది. ఆ తర్వాత 2019 నవంబర్? 14న అప్పటి సీజేఐ రంజన్? గొగోయ్? నేతృత్వంలోని ధర్మాసనం 3:2 మెజారిటీతో ఈ అంశాన్ని 9 మంది సభ్యులుగల అత్యున్నత ధర్మాసనానికిబదిలీ చేసింది.విచారణలో సుప్రీంకోర్టు కేవలం శబరిమల తీర్పు మెరిట్‌లను మాత్రమే కాకుండా, మతపరమైన స్థలాల్లో మహిళలపై వివక్షకు సంబంధించి రూపొందించిన ఏడు కీలక ప్రశ్నలపై దృష్టి సారిస్తామని స్పష్టం చేసింది

# పాత వాహనాల కొనుగోలులో అప్రమత్తత అవసరం... జాగ్రత్త!

**చౌకగా వస్తున్నాయని రిజిస్ట్రేషన్ పత్రాలు లేని వాహనాలు కొనవద్దు:కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్**



కర్నూలు, ఏప్రిల్ 09 (శ్రీచక్ర): పాత వాహనాలను కొనుగోలు చేసే సమయంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, తక్కువ ధరకే వస్తున్నాయని ఆశపడి రిజిస్ట్రేషన్ పత్రాలు లేని వాహనాలు కొనవద్దని, ఆ వాహనాలను కొని ఇబ్బందులు పాలవ్వకూడదని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం ఒక ప్రకటనలో జిల్లా ప్రజలకు తెలిపారు. మోటారు వాహనాల చట్టం ప్రకారం, సరైన పత్రాలు లేని వాహనాలను కలిగి ఉండటం లేదా నడపడం నేరమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా వాహన కొనుగోలుదారులు గమనించవలసిన ముఖ్యమైన అంశాలను ఎస్పీ వివరించారు.ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు, పత్రాల పరిశీలన, వాహనం కొనే ముందు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ (ఆర్సీ), ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికేట్ అసలైనవా కాదా అని రవాణా శాఖ (ఆర్టీఏ) వెబ్‌సైట్ ద్వారాసరిచూసుకోవాలన్నారు.చాసిస్ మరియు ఇంజన్ నంబర్ వాహనంపై ఉన్న చాసిస్ నంబర్, ఇంజన్ నంబర్... ఆర్సీ బుక్‌లో ఉన్న వివరాలతో సరిపోలుతున్నాయో లేదో భౌతికంగా తనిఖీ చేయాలన్నారు. యజమాని గుర్తింపు వాహనం విక్రయించే వ్యక్తి అసలు యజమాని అవునో కాదో ధృవీకరించుకోవాలన్నారు. ఆధార్ కార్డ్ వంటి గుర్తింపు కార్డులను పరిశీలించాలన్నారు.తక్కువ ధరకు ఆశపడొద్దు మార్కెట్ ధర కంటే అతి తక్కువ ధరకు వాహనం లభిస్తుందంటే అది దొంగతనం చేయబడినది లేదా నేర చరిత్ర కలిగినది అయ్యే అవకాశం ఉందని గుర్తించాలన్నారు. చట్టపరమైన చిక్కులు:దొంగ వాహనాలు కొనుగోలు చేయడం శిక్షార్హం. ఒకవేళ మీరు కొన్న వాహనం దొంగతనానిది అని తేలితే, మీరు ఐపీసీ మరియు మోటారు వాహనాల చట్టం కింద కఠిన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుందని కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ నకిలీ పత్రాలు ఉన్న వాహనాలకు ప్రమాదం జరిగినప్పుడు ఎటువంటి ఇన్సూరెన్స్ వర్తించదు. దీనివల్ల ఆర్థికంగా నష్టం వాటిల్లుతుందన్నారు. కోర్టు కేసులు, ఒకవేళ ఆ వాహనం ఏదైనా క్రైమ్ లేదా రోడ్డు ప్రమాదంలో ఇన్వాల్వ్ అయి ఉంటే, ప్రస్తుత యజమానిగా మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కావున, వాహనాల కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండి, చట్టపరమైన ఇబ్బందుల నుండి మిమ్మల్ని మీరు కాపాడుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించాలి

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. కబర్ధి





కర్నూలు లీగల్, ఏప్రిల్ 9(శ్రీ చక్ర ):బాలల్లో నేర స్వభావాన్ని నియంత్రించేల చర్యలు తీసుకోవాలని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి అన్నారు. గురువారం స్థానిక జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో బాలుల న్యాయ చట్టంపై అవగాహన మరియు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి, కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ అంతర్జాతీయ బాలల ఒడంబడిక ప్రకారం రాజ్యాంగంలో పొందుపరిచిన ప్రత్యేక నిబంధనలపై పోలీసు అధికారులు అవగాహన కలిగివుండాలని అన్నారు. బాల నేరస్తుల్లో వుండే నేర స్వభావాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి వారికి కౌన్సిలింగ్, విద్యాబోధన ద్వారా వారిలో మార్పు తీసుకురావలసిన అవసరం ఎంతైనా వుందని తెలిపారు. బాల నేరస్తుల్లో నేర స్వభావాన్ని నియంత్రించి మంచి మార్గంలో నడిపించేందుకు అందరు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి పిలుపునిచ్చారు. జువినైల్ జస్టిస్ యాక్ట్ గురించి మేజిస్ట్రేట్ టి.అపర్ణ తెలిపారు. ప్రజా వినియోగ సేవల కోసం శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్ పలు రంగాలకు సంబంధించి ఎలాంటి సేవలలో లోపంగానీ, నష్టం, అన్యాయం జరిగితే తక్షణమే పర్మనెంట్ లోక్ అదాలత్ ను సంప్రదించాలన్నారు. మహిళా డి. ఎస్. పి. ఉపేంద్ర బాబు పిల్లలు కేసుల పట్ల ఎలా విచారణ చెయ్యాలో పోలీసులకు తెలియజేశారు. మానసిక వైద్య నిపుణులు డాక్టర్ చంద్ర శేఖర్ బాలుర మానసిక రుగ్మతలపై సూచనలు సలహాలు తెలియజేసారు. మానసిక సమస్యల పరిష్కారం కొరకు టోల్ ఫ్రీ నెంబర్ 14416కు ఫోన్ చేయవచ్చని తెలిపారు. కర్నూలు ప్రభుత్వ బాలుర పరిశీలన గృహం సూపరింటెంట్ హుసేన్ భాష మాట్లాడుతూ బాలుర సంక్షేమం గురుంచి వివరించి బాలల పట్ల పాటించాల్సిన నిబందనలు కేసుల విచారణ అంశాల గురుంచి వివరించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ జుబేదా బేగం పిల్లల దత్తత చట్టం గురుంచి వివరించారు. గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ విజయ, డి. సి. పి. ఓ. శారద, డిస్టిక్ ప్రొఫెషనరీ ఆఫీసర్ దివాకర్, జె. జె. బి. మెంబర్ మాదవి, ఒన్ స్టాప్ సిబ్బంది, చిల్డ్రన్స్ ఎన్జీవో మౌనిక, కర్నూలు జిల్లా ప్రత్యేక జువైనల్ పోలీస్ యూనిట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హత్యగా పరిగణించబడని దోషపూరిత హత్య కేసులో ఇద్దరు ముద్దాయిలు అరెస్టు

## 4 వ పట్టణ సీఐ విక్రమ్ సింహ



కర్నూలు, ఏప్రిల్ 09 (శ్రీచక్ర): కర్నూల్ టౌన్ బిర్లా గడ్డ కు చెందిన బడేసాబ్, వినయ్, కిరణ్ కుమార్ మరియు గణేష్ నగర్ కి చెందిన రాజారెడ్డి లు స్నేహితులని కర్నూలు 4 వ పట్టణ సీఐ విక్రమ్ సింహ తెలిపారు. గురువారంఆయన పోలీస్ స్టేషన్ లో విందుతుల వివరాలు వెల్లడించారు. అందరి వయస్సు 20 సంవత్సరాల లోపు వారే. 7/8 వ తేదీ అర్ధ రాత్రి హతుడు ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం విద్యార్థి అయిన కిరణ్ కుమార్ అతని స్నేహితుడైన బడే సాబ్ కి ఫోన్ చేసి వారు తనతో పాటు కృష్ణానగర్ కి రావాలని అడుగగా బడే సాహెబ్ మరియు కిరణ్ కుమార్ ఇద్దరు కలిసి ఒక మోటార్ సైకిల్ లోను ఇతర స్నేహితులైన వినయ్, రాజారెడ్డి మరొక మోటార్సైకిల్ లోను కృష్ణ నగర వైపు రాగా అక్కడ కృష్ణానగర్ జంక్షన్ నందు చికెన్ కబాబ్ బండి నడుపుకునే అన్నదమ్ములైన ఇస్మాయిల్ మరియు అస్లాంల ఇంటి వద్ద ఆగి గతంలో మద్దూరు నగర్ లోని ఒక పెళ్లిలో కలుసుకొన్నారు. నిర్దిష్టమైన కారణం లేకుండా అన్నదమ్ములైన ఇస్మాయిల్, అస్లాంకు మరియు కిరణ్ కుమార్ కి వాగ్వాదం జరిగి ఒకరినొకరు కొట్టుకునే స్థాయికి వెళ్ళగా అక్కడున్న పెద్దవాళ్లు కలుగజేసుకొని సర్ది చెప్పి పంపించడంతో ఎవరిళ్లకు వారు వెళ్లిపోయారు.అయితే అదే విషయాన్ని మనసులో పెట్టుకొని హతుడు కిరణ్ కుమార్ మరియు వారి స్నేహితులు కలిసి కృష్ణ నగర్ లో నివాసం ఉండే అస్లాం ఇంటికి వెళ్లి మాట్లాడుకోవాలి కిందికి రా అని పిలవగా అస్లాం మరియు ఇస్మాయిల్ లు కిందికి రాగా కిరణ్ కుమార్ కి అస్లాంకి మధ్యలో గతంలో పెళ్లిలో జరిగిన వాగ్వాదం పైన ఒకరు దూషించుకుంటూ ఉండగా ఇంతలో బడేసాబ్, వినయ్, రాజారెడ్డిలు వారిని విడిపించే క్రమంలో అన్నదమ్ములైన ఇస్మాయిల్, అస్లాంలు కిరణ్ కుమార్ ని చాతి మీద కడుపు మీద కొట్టడంతో కింద పడ్డ కిరణ్ కుమార్ కి తలకు గాయం అవ్వడం వల్ల లేవలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు అది గమనించని నిందితులు అస్లాం, ఇస్మాయిల్ లు కాళ్లతో కిరణ్ కుమార్ యొక్క ఛాతి మీద తన్నడం జరిగింది. దెబ్బలు తిన్న కిరణ్ కుమార్ వాంతులు చేసుకోవడంతో కిరణ్ కుమార్ యొక్క స్నేహితులు బడే సాబ్, వినయ్ రాజారెడ్డిలో నిందితులను పక్కకు తోసి కిరణ్ కుమార్ ని హాస్పిటల్ కి తీసుకెళ్లే క్రమంలో నిందితుల్లో ఒకరైన ఇస్మాయిల్ పక్కనే ఉన్న చిన్న రాయితో బడే సాబును కూడా కొట్టడంతో తలకు గాయం అయింది. వెంటనే కిరణ్ కుమార్ ని అతని స్నేహితులు కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ కి చికిత్స కోసం తరలించగా పరీక్షించిన డాక్టర్లు అతను అప్పటికే చనిపోయినాడు అని నిర్ధారించడం జరిగింది.సదరు విషయాన్ని హతుడి స్నేహితుల ద్వారా తెలుసుకున్న అతడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కర్నూలు 4 వ టౌన్ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేశారు. కర్నూల్ ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కర్నూల్ డీఎస్పీ శ్బాబు ప్రసాద్ సూచనల మేరకు సీఐ విక్రమ సింహ, ఎస్ ఐలు గోపినాథ్, చంద్ర శేఖర్ రెడ్డి, ఏ ఎస్ ఐ మునిరామయ్య, పిసిలు సుబ్బారాయుడు, మురళీధర్ ప్రత్యేక బృందంగా ఏర్పడి ధర్యాప్తు లో భాగంగా గురువారం కేసులో నిందితులుగా ఉన్నటువంటి అన్నదమ్ములు ఇస్మాయిల్ మరియు అస్లాంలను కృష్ణానగర్ లో అరెస్టు చేసి రిమాండ్ కి తరలించడం జరిగిందన్నారు

# న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేయాలి

## న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ



కర్నూలు లీగల్, ఏప్రిల్ 9(శ్రీ చక్ర ):న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేయాలని కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బి. చంద్రుడు టీ. మహేష్ రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాది పూజారి ఎల్లయ్య హత్యకు నిరసనగా కర్నూలు జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూపూజారి ఎల్లయ్యను అతి దారుణంగా దుండగులు హత్య చేయుడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశంలో రోజు రోజుకి న్యాయవాదులపై భౌతిక దాడులు జరుగుతు న్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో తక్కువ సమయంలో సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో తీర్మానం చేసి చట్టం తేవడంతో జరిగిందని అలాగే ఏపీలో కూడా సీఎం నారా చంద్రబాబు నాయుడు రాబోయే క్యాబినెట్ సమావేశాల్లో మొదటి అంశముగా ప్రాధాన్యత ఇవాళ అన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బి. మద్దిలేటి, రాజేష్, బి. హుస్సేన్, సురేష్ షఫీ అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

# ఈశ్వర్ ప్లే స్కూల్ ప్రారంభించిన మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్



కర్నూలు, ఏప్రిల్ 09 (శ్రీచక్ర): స్థానిక షరీన్ నగర్ నందు నూతనంగా ఏర్పాటు చేసిన ఈశ్వర్ ప్లే స్కూల్ ను మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశత్యాధునిక వసతులతో చిన్న పిల్లలకు అవసరమైన ఏర్పాట్లతో ఈశ్వర్ ప్లే స్కూలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్లే స్కూల్ నందు చేరే చిన్న పిల్లల రక్షణ కొరకు మేనేజ్మెంట్ అన్ని రకాల ఏర్పాట్లు చేసిందని టీజీ వెంకటేష్ తెలిపారు. చిన్నపిల్లల్లో ఆటపాటలతో పాటు విద్య పట్ల ఆసక్తి కనబరిచే విధంగా అన్ని వసతులను ఏర్పాటు చేయడం వారి చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. లాబాపేక్ష లేకుండా చిన్నపిల్లలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం ప్రారంభించిన ఈశ్వర్ ప్లే స్కూల్ అనతి కాలంలోనే వృద్ధిలోకి రావాలని కోరుకుంటున్నట్టు టీజీ తెలిపారు. నేటి బాలలే, రేపటి భావి భారత పౌరులని అటువంటి పౌరులను చిన్నప్పటినుంచే సన్మార్గంలో పయనించే విధంగా ప్లే స్కూల్ యాజమాన్యం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ ప్లే స్కూల్ యాజమాన్యం ఈశ్వర్ బాబు, వెంకటేష్ తేజ, త్రినాథ్, లీలావతి ఆర్యవైశ్య నాయకుడు రాజగోపాల్, అడ్వకేట్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ పై అవగాహన..., సెన్సెస్ ప్రక్రియ పై అవగాహన కల్పిస్తున్న కోట తాహసిల్దార్ సెన్సస్ ఛార్జ్ ఆఫీసర్ కటారి.జయ జయ రావు..,

కోట : ఏప్రిల్ 9 (శ్రీ చక్ర):జనాభా లెక్కలు విధి విధానాలపై డిజిటల్ విధానంలో ఫీల్డ్ సర్వే నిర్వహిస్తున్నట్లు కోట తాహాసిల్దార్ సెన్సెస్ ఛార్జ్ ఆఫీసర్ కటారి.జయ జయ రావు అన్నారు.ఈ సందర్భంగా కోట మండలంలోని స్థానిక ఎన్.బి.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ జనాభా లెక్కల ఫీల్డ్ సర్వే లో గృహాల జాబితా ప్రస్తుతం ప్రారంభమై మే ఒకటో తేదీ వరకు కొనసాగుతుందన్నారు.ఈ ప్రక్రియ పూర్తిగా డిజిటల్ విధానంలో జరుగుతుందని ఇందులో స్వీయ గణన (సెల్ఫ్ ఇనుమరేషన్) సదుపాయాలు,ఇంటి నిర్మాణం, సౌకర్యాలు,కులాల వివరాలు సేకరించ బడుతుందన్నారు. అంతేకాకుండా ప్రజల వ్యక్తిగత గణన,సామాజిక,ఆర్థిక విద్య, తదితర వివరాలను సేకరించే విధానంపై ఇనుమురేటర్లకు, సూపర్వైజర్లకు అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ప్రస్తుతం మొదటి విడత హౌస్ లిస్టింగ్ పై సర్వే ప్రారంభమైందని తెలిపారు.అదేవిధంగా రెండవ విడత జనాభా గణన పై సర్వే జరుగుతుందన్నారు.ఈ ప్రక్రియలో 98 మంది ఎనుమర్రేటర్లు 16 మంది సూపర్వైజర్లు మొత్తం 114 మందిని ఎంపిక చేసామని తెలిపారు.వీరిలో మూడు భాగాలుగా చేసి వారిని దఫాలుగా ఫీల్డ్ సర్వే చేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంపై రమణయ్య, నాగరాజు అను మాస్టర్ లు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో తాహసిల్దార్,సెన్సస్ చార్జ్ ఆఫీసర్ కటారి.జయ జయ రావు,స్థానిక ఎంపీడీవో దిలీప్ కుమార్ నాయక్,ఎంపీడీవో కార్యాలయ అసిస్టెంట్ ఆఫీసర్ శివకుమార్,ట్రైనర్లు రమణయ్య, నాగరాజు,ఇనుమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.



# 14న ధరిత్రీ పరిరక్షణలో మనవంతు పాత్ర అంశంపై వ్యాసరచన పోటీలు

## నైస్ యూత్ ఫర్ కల్చర్, ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు లయన్ డా. రాయపాటి శ్రీనివాస్



కర్నూలు, ఏప్రిల్ 09 (శ్రీచక్ర): భారత ప్రభుత్వ భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ , నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 22న ధరిత్రీ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారత ప్రభుత్వ దరిత్రీ దినోత్సవ పక్షోత్సవాల్లో భాగంగా వాతావరణ మార్పులు, కారణాలు,పరిష్కారాలు -ధరిత్రీ పరిరక్షణలో మనవంతు పాత్ర అంశంపై 14వ తేదీన సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియం విభాగాలలో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు నైస్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు లయన్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు . 14న మధ్యాహ్నము మూడు గంటలకు నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో జరిగే ఈ పోటీలలో 4 నుంచి 10 సంవత్సరాలు లోపు వారిని సబ్ జూనియర్స్ గాను, 11 నుంచి 14 సంవత్సరాల లోపు వారిని జూనియర్స్ గాను ,15 సంవత్సరాలు మరియు పైబడిన వారిని సీనియర్స్ గాను పరిగణిస్తారని ,ప్రతి విభాగము నుండి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు మరియు సర్టిఫికెట్లు ఉంటాయని ఆసక్తి గలవారు తమ పేర్లను వెంకటరమణ కాలనీ మొదటి లైన్ లో ఉన్న నైస్ కంప్యూటర్స్ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని వివరాలకు 9396861308 నంబరును సంప్రదించాలని తెలిపారు.

# న్యాయవాదులపై దాడి చేసే వారిని కఠినంగా శిక్షించాలి - ఎస్. జె. డబ్ల్యూ. హెచ్. ఆర్. సి నేషనల్ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్



కడప, ఏప్రిల్ 9 (శ్రీచక్ర): అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అనేది చాలా కఠినంగా ఉండాలని, అప్పుడే న్యాయవాదులకు రక్షణ ఉంటుందని సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ కొప్పుల విజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం కడప జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విజయ్ కుమార్ మాట్లాడుతూ చట్టాన్ని, న్యాయాన్ని రక్షించే న్యాయవాదులకు రక్షణ లేకుంటే న్యాయ వ్యవస్థ ఎలా నడుస్తుంది అని అన్నారు. రెండు రోజుల క్రితం అన్నమయ్య జిల్లా కె. వి పల్లి మండలం వడ్డిపల్లిలో న్యాయవాది ఎల్లయ్యను దుండగులు హత్య చేయడం, అలాగే ఈనెల 6వ తేది బద్వేల్ బార్ అసోసియేషన్ న్యాయవాది బొల్లు భాస్కర్ ఇంటిపై దాడి చేయడం లాంటి సంఘటనలు మాత్రమే కాకుండా గతంలో కూడా దాడులు పలు చోట్ల న్యాయవాదులపై జరిగాయని పేర్కొన్నారు. ఇలా భద్రత, రక్షణ లేకుండా ఉంటే త్వరలో న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా కోర్టుకు హాజరు కాకుండా విధుల భహిస్కరణ చేయడం తథ్యం అని అన్నారు. ఆలా చేస్తే ఎన్నో కేసులు పెండింగ్ లో ఉండి కేసుల పరిస్కారం కాకుండా మరింత ఆలస్యం అవుతుంది అని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కూడా న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని ప్రవేశపెట్టి వెంటనే కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. న్యాయవాధులను కొట్టిన, దూసించిన, ఏ చిన్నపాటి దాడి జరిగినా వెంటనే దుండగులను చాలా కఠినంగా శిక్షించడానికి పోలీసులు నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని పేర్కొన్నారు..

# సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి

## విధులకు గైర్హాజరు అయితే కఠిన చర్యలు :జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



బేతంచర్ల, ఏప్రిల్ 09 (శ్రీచక్ర): సచివాలయ సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు సేవలను సమర్థవంతంగా ప్రజలకు చేరవేయాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశించారు. గురువారం బేతంచెర్ల మండలం ఆర్. కొత్తపల్లె గ్రామంలోని స్వర్ణ గ్రామ సచివాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది ఆన్‌లైన్ హాజరు నమోదును పరిశీలించారు. విధులకు హాజరుకాని పంచాయతీ గ్రేడ్-5 సిబ్బంది మరియు వీఆర్వోపై షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిబ్బంది ఎవరెవరు ఏ విధులు నిర్వహిస్తున్నారనే అంశంపై కలెక్టర్ వివరణ కోరారు. సచివాలయంలో నిర్వహిస్తున్న వివిధ రిజిస్టర్లను సమగ్రంగా పరిశీలించి, వాటి నిర్వహణపై సూచనలు ఇచ్చారు. సచివాలయ ఆవరణలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పబ్లిక్ పర్సెప్షన్ సర్వేలో సాధించిన పురోగతి, ప్రజలు అడుగుతున్న ప్రశ్నలు, వాటిపై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నారా లేదా అనే అంశాలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రీసర్వేకు సంబంధించి వీఆర్వో, సర్వేయర్ అందుబాటులో లేరని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**జలధార-జల హారతి కార్యక్రమం ద్వారా నీటి భద్రత బలోపేతం**
**గ్రామ స్థాయి ప్రణాళికలపై కలెక్టర్ సమీక్షxజిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి**



కర్నూలు, ఏప్రిల్ 09 (శ్రీచక్ర): భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి పేర్కొన్నారు. గురువారం కోసిగి మండలం డి. బెలగల్ గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో "జలధార?జల హారతి" కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి నీటి ప్రణాళికలపై జిల్లా కలెక్టర్ గ్రామ ప్రజలు, సాగునీటి సంఘాల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో నీటి భద్రత ను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తక్కువ వర్షపాతం నమోదవుతున్న నేపథ్యంలో ఎక్కువ నీటిని వినియోగించే వరి వంటి పంటల స్థానంలో తక్కువ నీటితో పండే పంటలను రైతులు ఎంచుకోవాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 100 రోజుల ప్రత్యేక కార్యాచరణ కార్యక్రమం "జలధార?జల హారతి" ద్వారా నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా చెరువులు, చెక్‌డ్యామ్‌లు మరమ్మతులు, పూడికతీత పనులు ఉపాధి హామీ పథకంతో వేగవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకోవడమే ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని అన్నారు. గ్రామాలలో సంవత్సరాలుగా ఉపయోగంలో లేని చెక్‌డ్యామ్‌లు, చెరువులలో పెరిగిన పిచ్చి మొక్కలను బుష్ క్లియరెన్స్ ద్వారా శుభ్రపరిచి తిరిగి వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో కోసిగి ప్రాంతంలో భూగర్భ జలాలు సుమారు 29 మీటర్ల లోతులో ఉన్నాయని పేర్కొంటూ, వాటిని పెంపొందించేందుకు సమగ్ర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షపు నీటిని వృథా కాకుండా కుంటలు, వాగులు, చెరువులలో నిల్వ చేసే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. అనంతరం స్థానిక నాయకులు, సాగునీటి సంఘాల నాయకులతో మరియు సంబంధిత అధికారులతో కలిసి గ్రామానికి సంబంధించిన భూగర్భ జలాలను పెంపొందించే గ్రామ ప్రణాళిక మ్యాప్ మరియు సంబంధిత అంశాలను కలెక్టర్ చర్చించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఆదోని సబ్ కలెక్టర్ (ఇంచార్జి) అజయ్ కుమార్, డ్వామా పి.డి నరసింహారెడ్డి, ఇరిగేషన్ ఎస్.ఈ బాలచంద్రరెడ్డి, ఎల్.ఎల్.సి చైర్మన్ టిప్పు సుల్తాన్, సాగునీటి సంఘం అధ్యక్షులు అనంతసేనారెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ నరస రెడ్డి, తహసీల్దార్ వేణు గోపాల్ శర్మ, ఎంపీడీవో యస్.యం భాషా తదితరులు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, చెరువుల పునరుద్ధరణతో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం:జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి



కర్నూలు, ఏప్రిల్ 09 (శ్రీచక్ర): నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదల, చెరువుల పునరుద్ధరణతో 100 రోజుల ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి తెలిపారు. గురువారం జలధార - నీటి భద్రత కార్యక్రమంలో భాగంగా కోసిగి మండలం డి.బెలగల్ గ్రామంలోని చెక్ డ్యామ్‌ను, నాగమ్మ చెరువును జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డి.బెలగల్ గ్రామంలోని చెక్ డ్యామ్‌ను, నాగమ్మ చెరువులను నీటితో నింపేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. వాగులు, వంకలలో ఉన్న అడ్డంకులు తొలగించి చెరువుల్లో నీరు చేరేలా చూడాలన్నారు. తద్వారా భూగర్భ జల మట్టం పెంపుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లో వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అదే విధంగా కెనాల్ లలో ఉన్న నీరు, ఎల్ ఎల్ సీ, చెరువులకు అనుసంధానం తదితర వివరాలను పరిశీలించి నీటి నిల్వ సామర్థ్యం వంద శాతం పెంచేలా యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలు చేయాలన్నారు. ఫీడర్ కెనాల్స్ పరిస్థితి, వాటి సామర్థ్యం, జంగిల్ క్లియరెన్స్, బండ్స్ రిపేర్ వంటి అంశాలపై కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో చర్చించి, మరమ్మతుల కోసం ఎస్టిమేట్ లను సిద్ధం చేయాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. న కోసిగి మండలంలోని చెరువులు, కుంటలు చాలా కాలంగా ఎండిపోయి లేదా పూడిక పేరుకుపోయి ఉన్నాయన్నారు. మిగతా మండలాలతో పోలిస్తే కోసిగి లో భూగర్భ జల మట్టం 29 మీటర్ల లోతులో ఉందన్నారు. పక్కనే ఉన్న పెద్దకడబూరులో ఇది కేవలం 2 మీటర్లే ఉందన్నారు. జిల్లా సగటు 6.6 మీటర్లుగా ఉంటే, దాన్ని 4 మీటర్ల లోపుకు తీసుకురావడమే లక్ష్యం అన్నారు. డ్వామా, ఇరిగేషన్, అగ్రికల్చర్ మరియు పంచాయతీ రాజ్ విభాగాల సమన్వయంతో యాక్షన్ ప్లాన్ రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తున్నామన్నారు. వీబీ జీ రామ్ జీ పథకం కింద పనులను సరైన ప్రదేశాల్లో చేపట్టి భూగర్భ జలాలను పెంచడమే ప్రధాన ఉద్దేశం అన్నారు. జిల్లాలో 246 ఓఎ ట్యాంకులు ఉన్నాయని, అదృష్టవశాత్తూ ఈసారి వర్షాల వల్ల సుమారు 75 శాతం కంటే ఎక్కువ నిండాయన్నారు. కేవలం వర్షాలపైనే ఆధారపడకుండా, వాగులు వంకలు క్లియర్ చేసి చిన్న చిన్న కుంటలను కూడా నింపగలిగితే, జిల్లాలో సాగు కోసం ఆధారపడిన బోరు బావులన్నీ తిరిగి పనిచేసే అవకాశం ఉంటుందన్నారు. కాబట్టి మొదట గ్రౌండ్ వాటర్ రీఛార్జ్ చేయడంపై దృష్టి పెట్టామని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ ఖమర్, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, డ్వామా పిడి నరసింహ రెడ్డి, ఆదోని ఇంచార్జి సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, కోసిగి తహసిల్దార్ వేణుగోపాల్ శర్మ,ఎల్ ఎల్ సి చైర్మన్ టిప్పు సుల్తాన్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కర్నూలులో వేర్వేరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్యకర్తలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే కాటసాని







కర్నూలు, ఏప్రిల్ 09 (శ్రీచక్ర): రోడ్డు ప్రమాదానికి గురై కర్నూలు నగరంలోని గురువారం కిమ్స్ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న బేతంచర్ల (కాలేజ్) జీ.భూపాల్ రెడ్డి కుమారుడు నవీన్ సాయిను పరామర్శించి.. ఆయన ఆరోగ్య పరిస్థితిని డాక్టర్లనుఅడిగితెలుసుకోని మెరుగైన వైద్యం అందించాలని అన్నారు. కుటుంబ సభ్యులకు దైర్యం చెప్పి,నవీన్ సాయి తోరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అదేవిధంగా అశ్విని హాస్పిటల్ నందు కిడ్నీలో రాళ్ల సమస్యతో చికిత్స పొందుతున్న కల్లూరు అర్బన్ 31వ వార్డు మాజీ కార్పొరేటర్ మిద్దె చిట్టెమ్మ సోదరుడు పెద్దన్నను పరామర్శించి, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. కర్నూలు ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ నందు గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందుతున్న కల్లూరు మండలం వామసముద్రం గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త నారాయణనుపరామర్శించి,నారాయణ ప్రస్తుత పరిస్థితిని డాక్టర్లను అడిగి తెలుసుకోని, మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షులు, కాటసాని రామభూపాల్ రెడ్డి కోరారు.

# కొత్తబురుజులో ఇంటింటికీ శుద్ధజలానికి శ్రీకారం

**రూ.30 లక్షలతో నల్లా కనెక్షన్ల పనుల ప్రారంభం**
**సీఎం హామీ అమలు దిశగా వేగంగా అడుగులు**
**స్వచ్ఛ భారత్ కింద మరుగుదొడ్ల నిర్మాణానికి నిధుల మంజూరు**
**జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, ఎమ్మెల్యే కోట్ల**









డోన్, ఏప్రిల్ 09 (శ్రీచక్ర) : డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో ఇంటింటికీ శుద్ధజలాన్ని అందించే లక్ష్యంతో కొళాయి కనెక్షన్ల పనులను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. గురువారం కొత్తబురుజు గ్రామంలో జిల్లా మినరల్ ఫండ్ నుంచి రూ.30 లక్షల వ్యయంతో చేపట్టిన ఈ పనులను డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డితో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత నెల 9వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గ్రామ పర్యటనలో ఇచ్చిన హామీ మేరకు ఈ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి శుద్ధమైన తాగునీరు అందించడం ద్వారా ప్రజల ఆరోగ్యానికి, జీవన ప్రమాణాల మెరుగుదలకు దోహదం కలుగుతుందని పేర్కొన్నారు. అదేవిధంగా, స్వచ్ఛ భారత్ మిషన్ కింద మరుగుదొడ్లు లేని 30 మంది లబ్ధిదారులకు రూ.4.5 లక్షలతో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ పనులను కూడా ప్రారంభించామని తెలిపారు. ఈ చర్యలతో గ్రామంలో పరిశుభ్రత పెరగడంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు బలం చేకూరుతుందని అన్నారు. గ్రామాభివృద్ధికి సంబంధించిన గతంలో కోరిన ఆరు పనులను ఇప్పటికే మంజూరు చేశామని, అవి సకాలంలో పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. మిగిలిన పనులను కూడా వారం నుంచి పది రోజుల్లో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. నీటి సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించిన కలెక్టర్, చెరువులు, ఫీడర్ ఛానల్స్ అభివృద్ధి వంటి పనులు పూర్తయితే భూగర్భ జలమట్టం పెరిగి అందరికీ ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. గ్రామాభివృద్ధి కోసం ప్రజలంతా ఐక్యంగా సహకరించాలని పిలుపునిచ్చారు. జిల్లాలో సుమారు 7 లక్షల ఎకరాల్లో సాగవుతున్న సాధారణ పంటల ద్వారా రూ.4,000 కోట్ల ఆదాయం వస్తుండగా, కేవలం 49 వేల హెక్టార్లలో సాగవుతున్న ఉద్యానవన పంటల ద్వారా రూ.7,000 కోట్ల ఆదాయం లభిస్తోందని తెలిపారు. ఇందులో డోన్ నియోజకవర్గం కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. రైతులు హార్టికల్చర్ పంటలపై దృష్టి సారిస్తే మరింత లాభదాయకంగా ఉంటుందని సూచించారు. నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపడం, ఫీడర్ ఛానల్స్ శుభ్రపరచడం వంటి పనులకు ప్రాధాన్యతనిస్తూ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తున్నట్లు తెలిపారు. బోరు బావులపై ఆధారపడే రైతులకు నీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గ్రామాభివృద్ధి కార్యక్రమాలు విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, అందరూ కలిసికట్టుగా పనిచేస్తేనే ఆరోగ్యవంతమైన, అభివృద్ధి చెందిన గ్రామాన్ని నిర్మించగలమని కలెక్టర్ పిలుపునిచ్చారు. డోన్ శాసనసభ్యులు కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల సమగ్ర అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా శుద్ధమైన తాగునీటిని అందించడం కోసం కట్టుబడి ఉన్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తప్పకుండా నెరవేర్చుతామని, నీటి కొరత సమస్యను పూర్తిగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పెన్షన్లు, ఇళ్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి వంటి పలు సంక్షేమ కార్యక్రమాలు ఇప్పటికే అమలు చేశామని తెలిపారు. అలాగే, డ్రిప్ ఇరిగేషన్ మరియు స్ప్రింక్లర్ పద్ధతులను తిరిగి ప్రవేశపెట్టి నీటి వినియోగాన్ని తగ్గిస్తూ రైతుల ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

## నల్లపరెడ్డి.జగన్మోహన్ రెడ్డిని పరామర్శించిన జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి



కోట : ఏప్రిల్ 9 (శ్రీ చక్ర): కోట మండలంలోని టిడిపి సీనియర్ నాయకులు నల్లపరెడ్డి.జగన్మోహన్ రెడ్డిని కోటలోనిఆయన నివాసంలో జగన్మోహన్ రెడ్డి మేనల్లుడు తెలంగాణ రాష్ట్రం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి. అనిరుద్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి అనారోగ్యంతోఉండడంతోజడ్చర్లఎమ్మెల్యేఅనిరుద్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య విషయాలపై ఆరా తీశారు.అంతేకాకుండా రక్త సంబంధీకులు కావడంతో కుటుంబ విషయాలను చర్చించుకోవడం జరిగింది.అదేవిధంగా నల్లపరెడ్డి. జగన్మోహన్ రెడ్డిఆరోగ్యం పై స్పందించి ధైర్యంగా ఉండాలని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి జగన్మోహన్ రెడ్డికి తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్లపరెడ్డి వినోద్ కుమార్ రెడ్డి,నల్లపురెడ్డి బంధువులు ఉన్నారు.

## జనన గణన పై పూర్తి అవగాహన కలిగి ఉండాలి


**మూడు రోజులపాటు జనన గణనపై శిక్షణ**

**కాజులూరు శిక్షణ కార్యక్రమంలో తహశీల్దార్ ఠాగూర్**



కాజులూరు, ఎప్రిల్ 9( శ్రీచక్ర)త్వరలో చేపట్టనున్న జనన గణన పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కాజులూరు తహసిల్దార్ జి ఆర్ ఠాగూర్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కాజులూరు మండలం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశ మందిరం నందు మూడు రోజులపాటు జరగనున్న జనన గణన శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టాగూర్ మాట్లాడుతూ9.నుండి 11 వ తేదీ వరకు మూడు రోజుల పాటు 2027 జనన గణన చేయుటకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు . ఈ సందర్భంగా శిక్షణకు ఎన్యూమరేటర్ లు, సూపర్ వైజర్ లకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమం నందు ఛార్జ్ ఆఫీసర్ గా తహసీల్దార్ , అసిస్టెంట్ ఛార్జ్ ఆఫీసర్ ఎంపీడీవో,, ఏ ఎస్ ఓ, డిప్యూటీ తహసీల్దార్ హాజరై ఉదయం 9.గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని తహసీల్దారు ఠాగూర్ పేర్కొన్నారు.

## డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫేర్వెల్ పార్టీ నిర్వహణ



రామచంద్రపురం, ఏప్రిల్ 9( శ్రీచక్ర) రామచంద్రపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఏ విద్యార్థులకు వీడ్కోలు సభను గురువారం ఏర్పాటు చేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.హెచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో ముందు ఉండడానికి ఎన్ఊ అవకాశాలు ఉన్నాయని, కాంపిటేటివ్ ఎగ్జామ్స్ రాయాలనుకున్నవారు బి.ఏ చదవడం వల్ల పోటీపరీక్షలకు సులువు అవుతుందని, బి.ఏ చదువుతున్న వారందరికీ కూడా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు . అలాగే ఉన్నత విద్యా అవకాశాలకి సైతం ఆస్కారం ఉన్నదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ వై పద్మజ , ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. శ్రీనివాస్ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎన్వి. రమణ ,ఎకనామిక్స్ అధ్యాపకులు బి. రవిబాబు ఇతర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఊఈ కార్యక్రమంలో పాల్గొన్నారు .విద్యార్థిని విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని సాంస్కృతిక కార్యక్రమాల్ని అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించాగా ఆహూతులను ఆకర్షించారు.

## జనసేన నేత మోసం చేసాడు

**బాధిత మహిళ వీడియో**

విజయవాడ,మరో జనసేన నేత రాసలీలలు బయటపడ్డాయి. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఎపిసోడ్ ఘటన మరవకముందే, తనను మోసం చేశాడంటూ మరో జనసేన నాయకుడి భాగోతం ఒక మహిళ బయట పెట్టింది.పశ్చిమ గోదావరి జిల్లా వీరవాసరం జడ్పీటీసీ జయప్రకాష్ నాయుడు తనను ఆర్థికంగా, శారీరకంగా వాడుకుని, చిత్రహింసలు పెడుతున్నాడని వీడియో విడుదల చేసింది.తాను పవన్ కళ్యాణ్ అభిమానినని, పార్టీ కార్యక్రమాల కోసం వెళ్లినప్పుడు జయప్రకాష్ నాయుడు పరిచయమయ్యాడని, భర్త లేని నన్ను పెళ్లి చేసుకుని బాగా చూసుకుంటానని నమ్మించాడని మహిళ ఆవేదన వ్యక్తం చేసింది. కొన్ని రోజుల తర్వాత మద్యం మత్తులో, గంజాయి మత్తులో తనను చితకబాదేవాడని, తనను కూడా గంజాయి సేవించమని ఒత్తిడి చేసేవాడని బాధిత మహిళ ఆరోపించింది. తనతో ఉండనని చెప్తే, నీ ఫోటోలు, వీడియోలు ఉన్నాయని బెదిరిస్తున్నాడని, తనకు న్యాయం చేయాలంటూ కన్నీరు పెట్టుకుంటూ వీడియో విడుదల చేసింది.

## సత్యవేడు నియోజకవర్గంలోని దళితులపై అక్రమ కేసులు ఎత్తివేయాలి కోరిన ఎమ్మెల్యే ఆదిమూలం





వరదయ్యపాలెం ఏప్రిల్ 9(శ్రీ చక్ర) జిల్లా కలెక్టర్, ఎస్పీ లకు ఆదేశాలిచ్చి దళితులకు న్యాయం చేయాలిఇల్లులేని ఎస్సీలకు ఇంటిపట్టాలు ఇప్పించండి,ఎస్సీ, ఎస్టీ కాలనీలకు స్మశానం, రోడ్లు వంటి మౌలిక వసతులు కల్పించాలి,ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కు ఎమ్మెల్యే ఆదిమూలం వినతిఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ కు ఘన స్వాగతం పలికిన జడ్పీటీసీ కోనేటి సుమన్సత్యవేడు నియోజకవర్గం లో దళితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని, ఇల్లు లేని ఎస్సీ లకు ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ ను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు.గురువారం తిరుపతి కి విచ్చేసిన ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కు నారాయణవనం జడ్పీటీసీ సభ్యులు కోనేటి సుమన్ కుమార్ తో కలిసి ఎమ్మెల్యే ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో బుచ్చి నాయుడు కండ్రిగ, వరదయ్యపాలెం మండలాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో దళితులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆవేదన వ్యక్తం చేశారు.అక్రమ కేసులు ఎత్తివేసి దళితులకు న్యాయం చేసే విధంగా జిల్లా కలెక్టర్, ఎస్పీలకు సూచించి బాదితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కు మెమొరాండం సమర్పించారు.అలాగే ఇల్లు లేని ఎస్సీ లకు ఇంటిపట్టాలు పంపిణీ చేయడంతో పాటు ఎన్టీఆర్ గృహ కల్ప పథకం కింద పక్కా ఇల్లు నిర్మించి ఇవ్వాలని, అలాగే ఎస్సీ, ఎస్టీ కాలనీలకు స్మశానం, రోడ్లు, త్రాగునీరు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.ఈ మేరకు ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ కు వినతి పత్రాన్ని ఎమ్మెల్యే అందజేశారు.తన వినతులకు ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే ఆదిమూలం వెల్లడించారు.

## త్రాగునీరు -సాగునీరు సక్రమంగా అందేలా చూడాలి..

**గ్రామాల్లో కమిటీలో ద్వారా నీటి లభ్యతను గుర్తించండి**

**పశువులకు నిరుఅందేలా చెరువులు నింపే చర్యలు చేపట్టాలి**

**మండల స్థాయి అధికారుల సమావేశంలోఎంపీడీవో రాంబాబు**





కాజులూరు, ఎప్రిల్ 9( శ్రీచక్ర)కాజులూరు మండలంలో త్రాగునీరు –సాగునీరుపై నిర్లక్ష్యం వహించవద్దని కాజులూరు ఎంపీడీవో జె. రాంబాబు సంబంధిత అధికారులకు సూచించారు. ఈ మేరకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతోత్రాగునీరు – సాగునీరు.ప్రాముఖ్యతపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రాంబాబు మాట్లాడుతూ వేసవికాలం దృష్ట్యా కమిటీలను ఏర్పాటు చేసి ప్రతీ గ్రామంలోని నీటిలభ్యత ప్రదేశాలను గుర్తించి ప్రజలకు త్రాగునీరు కొదువ లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు . అలాగే గ్రామాల్లో చెరువులను నింపుకొని పశువులకు నీటిని అందేలా చర్యలు తీసుకోవాలని తెలియజేసారు. ప్రస్తుతం అమలులో ఉన్న ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తిచేయాలని ఈసంధర్భంగా ఆదేశించారు . ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎం.పి.డి.ఓ ముద్రగడ చంటి,, ఆర్.డబ్ల్యు.యస్ జె.ఈ రూప, ఎం జి ఆర్ ఈజీఎస్ ఎపిఒ , జె.ఈ , పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్స్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాజులూరు మండలంలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు విద్యాశాఖ శ్రీకారం.

### విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని వినతి






కాజులూరు, ఎప్రిల్ 9 (శ్రీచక్ర)కాజులూరు మండలంలో రానున్న విద్యాసంవత్సరానికి విద్యార్థినీ విద్యార్థుల సంఖ్య మరింత పెంచేందుకు కాజులూరు విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఈ మేరకుని గురువారం మండల కేంద్రమైన కాజులూరులో మండల స్థాయి ఎన్రోల్మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల విద్యార్థిని తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు చేర్పిస్తే కలిగే సౌకర్యాలు లాభాలను సందర్భంగా అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు దాసరపల్లి డేవిడ్, పి.జాన్, ప్రధానోపాధ్యాయులు, కాజులూరు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు మార్ని. విష్ణు మూర్తి , ఎంపీఎస్,హెడ్ మాస్టర్ దుర్గారావు,మండల ఏవోగ. పద్మ లత , ఉపాధ్యాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ విద్యార్థి ఉన్నత లక్ష్యాలతో ముందుకు వెళ్ళాలి

**నాలుగు లక్ష్యాలతో ముందుకు వెళ్లొచ్చు**

**చెడు వ్యసనాలకు ఆకర్షణకు లోను కాకూడదు**

**సెల్ ఫోన్లుకు దూరంగా ఉండండి**

**బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు తొగరు మూర్తి**



రామచంద్రపురం, ఏప్రిల్ 9 (శ్రీచక్ర) ప్రతి విద్యార్థి ఉన్నతమైన లక్ష్యాలతో ముందుకు సాగాలని బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవాధ్యక్షులు తొగరు మూర్తి విద్యార్థులకు సూచించారు. ఈ మేరకు గురువారండాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజవర్గం ద్రాక్షారామం గ్రామంలో ఎస్ వి వారి శ్రీలక్ష్మి శర్వాణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు యాన్యువల్ సెలబ్రేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన బ్లడ్ డోనర్స్ క్లబ్ గౌరవ అధ్యక్షులు తొగరుమూర్తి విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు తమ లక్ష్యాలు సాధించడానికి నాలుగు అంశాలు ఉంటాయని అవి వినటం, రాయటం,చదవటం, మాట్లాడడం ,కానీ విద్యార్థులకు అన్ని సరిగా ఉన్నా మాట్లాడడం అలవాటు చేసుకోలేక కమ్యూనికేషన్స్ స్కిల్స్ కోల్పోతున్నారని తెలిపారు.ఎంతో పరిజ్ఞానం ఉండి కూడా ఆవగింజంత ప్రజెంటేషన్ ఇవ్వలేక ఇంటర్వ్యూలలో ఫెయిలవుతున్నారని మూర్తి పేర్కొన్నారు.అధ్యాపకులు విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇస్తే ఈ సమాజానికి గొప్ప సామర్థ్యాలు ఉన్న వ్యక్తులను పరిచయం చేసిన వారవుతారని తెలిపారు. తల్లిదండ్రులు చిన్నపిల్లలకు సెల్ ఫోన్ ఇచ్చి వారి జీవితాన్ని నాశనం చేస్తున్నారని,పిల్లలకు క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించాలని యోగా, సూర్య నమస్కారములు బాస్కెట్బాల్,జిమ్,షటిల్ వంటి వాటిలో శిక్షణ ఇప్పించాలని తెలిపారు. ఇవన్నీ విద్యార్థిని విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు .విద్యార్థులు కూడా చెడు వ్యసనాలకు, ఆకర్షణలకు లోను కాకుండా మీ పర్సనాలిటీ డెవలప్ చేసుకోవడానికి, ఉన్నతమైన లక్ష్యంతో చదువుకోవాలని హితవు పలిపారు.ఈ కార్యక్రమంలో శ్రీలక్ష్మి శర్వాణి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ అధినేత గంగుమల్ల సోమేశ్,డాక్టర్ మధు కుమార్,నరాల రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అవోపా ఆధ్వర్యంలో అన్నదాన ప్రసాద వితరణ అవోపా అధ్యక్షులు చీదెళ్ల లక్ష్మణరావు వెల్లడి



మార్కాపురం ఏప్రిల్ 9 ( శ్రీ చక్ర)మార్కాపురం సమాజ సేవలో అవోపా శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి తిరుణాలను పురస్కరించుకొని గరుడ వాహనం గురువారము శ్రీ రాచపూడి పుల్లయ్య ట్రస్ట్ భవనం వద్ద భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. 2017 వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం 1000మంది పైగా భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని అందిస్తున్నామని అదేవిధంగా రథసప్తమి రోజు సాయంత్రం అల్పాహారాన్ని, మూడు మండలాల పరిధిలో వ్యాసరచన పోటీలు నిర్వహించి గాంధీ జయంతి రోజున విద్యార్థులకు బహుమతులు మరియు బీదలకు దుప్పట్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేస్తున్నామని తెలియజేశారు.ఎస్ఎస్సి టాపర్స్ కు అభినందన అభినందన కార్యక్రమము మరియు బీదలకు చీరల పంపిణీ వంటి కార్యక్రమాలు కూడా చేస్తున్నామని అధ్యక్షులు చీదెళ్ల లక్ష్మణరావు తెలియజేశారు. ఈ అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో సెక్రటరీతల్లంవెంకటరామకృష్ణారావు,ట్రెజరర్గర్రె అనంత రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్ల రామారావు, గౌరవాధ్యక్షులు సూరే వెంకటేశ్వర్లు, రాష్ట్ర మెంబర్ దేవి శెట్టి రాజశేఖర్ మరియు కార్యవర్గ సభ్యులు నాగేశ్వర రావు, రామకృష్ణ, పిచ్చి రావు, శంకర్రావు, ఆదినారాయణ శెట్టి, కొలిశెట్టి లక్ష్మీనారాయణ, శేషఫణి, హనుమంతరావు, పెరుమాళ్ళ ప్రసాదు మరియు మోదాల ప్రసాదు దాతలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.


## పోషణ పక్వాడ కార్యక్రమంతో చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేయండి.జిల్లా కలెక్టర్ విజయ సునీత.




మార్కాపురం ఏప్రిల్ 9 (శ్రీ చక్ర)మార్కాపురం .పోషణ పక్వాడ కార్యక్రమం ద్వారా చిన్నారుల భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత అన్నారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం పోషణ్ పక్వాడ ఉత్సవాల కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఇన్చార్జి పీ డి పద్మావతి అధ్యక్షతన.ఘనంగా. నిర్వహిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ 15 రోజుల ఉత్సవాల.కార్యక్రమంలోఅంగన్వాడి కార్యకర్తలు, లబ్ధిదారులు, స్వయం సహాయక సంఘాలతో పోషణ ర్యాలీలు నిర్వహించి, ప్లకార్డులు, ఆకర్షణీయ నినాదాల ద్వారా ఆరోగ్య సందేశాలను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. 0 నుంచి 6 సంవత్సరాల చిన్నారులకు జంక్ ఫుడ్, ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆరోగ్యకరమైన ఆహారాన్ని ప్రోత్సహించేందుకు వంటల పోటీలు సైతం నిర్వహించాలని సూచించారు. పోషణ ప్రాముఖ్యతపై తాతలు, అమ్మమ్మలు కథలు చెప్పడం ద్వారా సమాజ స్థాయిలో పరస్పర అభ్యాసం అనుభవాలు పంచుకోవచ్చన్నారు. దీని ద్వారా చిన్నారుల్లో మానసిక పరిపక్వత వస్తుందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లల కోసం స్థానికంగా లభ్యమయ్యే పోషకాహారం వంటకాల ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. అదేవిధంగా తల్లిదండ్రులకు పిల్లల ఆరోగ్యం పై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఇటువంటి కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని అన్నారు. ఎన్జీవోలు, ప్రజా ప్రతినిధులను కలుపుకొని గ్రామీణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమం ప్రాముఖ్యత వివరించి... వారిలో పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. చిన్నప్పటినుంచే ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించడం ద్వారా భావి భారత సమాజాన్ని నిర్మించవచ్చని వివరించారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, జిల్లా మలేరియా అధికారి కే. రాహుల్, మెప్మాసిటీ మేనేజర్ ఎలీషా, ఐసిడిఎస్ సూపర్ వైజర్ నీలోఫర్, ఇతర అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

## సంబరాల పేరుతో మభ్యపెట్టడం మాని,,,రాజధాని కట్టి చూపండికూటమి సర్కార్ పై జంకె వెంకటరెడ్డి విమర్శ

మార్కాపురం ఏప్రిల్ 9 ( శ్రీ చక్ర)మార్కాపురం రాజధాని కట్టేస్తున్న ప్రపంచం అదిరేలా చేసేస్తున్నామని గత 2014 నుంచి గొప్పలు చెప్పుకొంటూ వస్తున్న చంద్రబాబు సర్కార్ ఇప్పటికీ ఏపీ క్యాపిటల్ అమరాతి పేరుతో సంబరాలు చేసుకొంటూ ప్రజలను ప్రతి రోజూ మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని మార్కాపురం వైసీ?పీ. నెల్లూరు జిల్లా పార్లమెంటు పరిశీలగులు.మరియు .మార్కాపురం. నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే..జంకె వెంకటరెడ్డి విమర్శిం చారు. ఏపీ రాజధానిగా అమరావతి ప్రకటించేలా కేంద్రం నుంచి నాడే ఎందుకు అనుమతి తీసుకురాలేదని ప్రశ్నించారు. నాడు కూడా మీరు మద్దతు ఇచ్చిన బీజేపీ సర్కారే కేంద్రంలో ఉంది కదా అని ఆయన ప్రశ్నించారు. ఇన్నాళ్లకు కేంద్రం రాజధానిగా అమరావతిని ప్రకటిస్తూ బిల్లు ఆమోదిస్తే ఇన్నాళ్లుగా కేంద్రంలోని బీజేపీ సర్కార్ చేసిన అన్యాయాన్ని విస్మరించి మోడీ సర్కార్ కు జై కొడుతూ తామేందో సాధించినట్లు చంద్రబాబు ప్రభుత్వం జబ్బలు చార్చుకొంటోందని ఆయన విమర్శలు చేశారు. రాజధాని అమరావతి విషయంలో తమ తప్పులను కప్పిపుచ్చుకొనేందుకు తమ అధినేత వైయస్ జగన్ ఏపీ రాజధానికి వ్యతిరేకం అన్నట్లుగా విష ప్రచారం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఏపీ రాష్ట్ర ప్రజలు ఎంతో ఆలోచన గల వారని, త్వరలోనే అమరావతి విషయంలో ఇన్నాళ్లపాటు చంద్రబాబు సర్కార్ చేసిన మోసాన్ని పసిగడతారని ఆయన స్పష్టంచేశారు. అప్పుడు చంద్రబాబు సర్కార్ కు నూకలు చెల్లడం ఖాయమని ఆయన హెచ్చరించారు.



# జిల్లా.కలెక్టరనుమర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నేతలు

## ఎన్నో ఉద్యమాలతోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు షేక్ సైదా వెల్లడి



మార్కాపురం ఏప్రిల్ 9 ( శ్రీ చక్ర (మార్కాపురం జిల్లా నూతన కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన విజయ సునీత గారిని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా సారథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు మార్కాపూర్ లోని.కలెక్టరేట్.లో.మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి 66 మెమెంటోని అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గారితో షేక్ సైదా ఇతర కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మార్కాపూర్ నూతన జిల్లా ఏర్పాటు కోసం 65 రోజులపాటు జరిగిన ఉద్యమ ప్రశ్నిస్తే అన్ని వివరించడం జరిగింది. అలాగే గతంలో ఈ ప్రాంతంలో పేదల భూముల్ని పెద్దలకు అస్సైన్ చేసిన ఇద్దరు ఎమ్మార్వోలు దాదాపు 12 మంది వీఆర్వోలు సస్పెండ్ అయిన విషయాన్ని కలెక్టర్ గారికి వివరించడం జరిగింది భూ కబ్జాలు జరగకుండా రెవిన్యూ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని, అసంపూర్తిగా ఉన్న షాది ఖాన్ నిర్మాణాన్ని కృషి చేయాలని, వేసవి అయినందున త్రాగునీటి వద్దకు తీవ్రంగా ఉందని, ఈ ప్రాంత సమస్యల్ని ముఖ్యమంత్రి గారు దృష్టి తీసుకెళ్లి త్వరితిగతంగా పరిష్కారం అయ్యే విధంగా కృషి చేయాలని కలెక్టర్ గారిని షేక్ సైదా . కోరారు. అలాగే ప్రతి సోమవారం జరిగే గ్రీవెన్స్ ను పట్టానికి నడిబొడ్డునున్న ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించాలని ఇప్పుడున్న కలెక్టరేట్ ప్రాంతం పట్నానికి దూరంగా ఉందని అనేకమంది వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు అక్కడి నుంచి ఆటోలో రావాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి మంచినీళ్లు కూడా దొరికినప్పుడు పరిస్థితులు ఉన్నందువల్ల అనేక మంది.ఇబ్బందులు.పడుతున్నారని ఆయన అన్నారు. అన్ని సమస్యలను సావధానంగా విన్న జిల్లా కలెక్టర్ అన్ని సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందానికి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ డిపార్ట్మెంట్ అధ్యక్షులు షేక్ మహబూబ్వాలి, మార్కాపూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సయ్యద్ ఇమ్రాన్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ నాయకులు, వీరేపల్లి గోపాల్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు షేక్ రెహనాబాను, తర్లపాడు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ హుస్సేన్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జీవయ్య, మార్కాపురం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ డిపార్ట్మెంట్ కన్వీనర్ షేక్ ఖాసిం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు షేక్ అల్తాఫ్, కేకేసి నాయకులు షేక్ ఇమ్రాన్, షేక్ నాగురు భాష తదితరులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్లు చారిత్రాత్మకం వికసిత భారత్‌లో నారీశక్తి కీలకం: డా. ఏలూరి

మార్కాపురం ఏప్రిల్ 9 (శ్రీ చక్ర (మార్కాపురం:×దేశంలో.మహిళలకు శాసనసభలు మరియు పార్లమెంట్‌లో రిజర్వేషన్ కల్పించడం భారత ప్రజాస్వామ్య చరిత్రలో చారిత్రాత్మక నిర్ణయమని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మహిళలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా దేశ రాజకీయ వ్యవస్థ మరింత సమగ్రతను సంతరించుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించడంలో నారీశక్తి భాగస్వామ్యం అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. మహిళల సామర్థ్యాన్ని గుర్తించి వారికి అవకాశాలు కల్పించడం ద్వారా దేశం ఆర్థిక, సామాజిక రంగాల్లో వేగంగా ఎదుగుతుందని తెలిపారు. మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న పలు చర్యలు దేశ అభివృద్ధికి బలమైన పునాది వేస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ మహిళలకు చట్టసభల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్నారని డా. ఏలూరి తెలిపారు. మహిళా రిజర్వేషన్లు అమలులోకి రావడం ద్వారా రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం గణనీయంగా పెరిగి, నిర్ణయ ప్రక్రియల్లో వారి పాత్ర మరింత బలపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మహిళలు రాజకీయాల్లోకి మరింతగా రావడం వల్ల ప్రజా సమస్యల పరిష్కారంలో సున్నితమైన, సమర్థవంతమైన దృక్పథం పెరుగుతుందని తెలిపారు. గ్రామ స్థాయి నుండి పార్లమెంట్ వరకు మహిళల ప్రాతినిధ్యం పెరగడం దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన చెప్పారు. అదేవిధంగా, మహిళలకు విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన వంటి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న పథకాలు నారీశక్తిని మరింత శక్తివంతం చేస్తున్నాయని వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావడం ద్వారా సమానత్వంతో కూడిన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. దేశ నిర్మాణంలో మహిళల భాగస్వామ్యం పెంపు ద్వారా సమగ్ర అభివృద్ధి, సామాజిక న్యాయం, సమాన హక్కులు సాధ్యమవుతాయని డా. ఏలూరి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. మహిళల శక్తిని సమర్థంగా వినియోగించుకోవడం ద్వారా వికసిత భారత్ లక్ష్యం సాకారం అవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.



# పవర్ ఫుల్ ఉమెన్ నుంచి జైలు గోడలవరకు...

కాకినాడ, ఏప్రిల్ 9,దేవాదాయ శాఖలో అత్యంత వివాదాస్పద అధికారిగా పేరుపొందిన అసిస్టెంట్ కమిషనర్ కళింగరి శాంతి ఉదంతం, అధికార బలం ఉంటే వ్యవస్థలను ఎలా శాసించవచ్చో చెప్పడానికి ఒక ఉదాహరణగా నిలుస్తుంది. కేవలం ఆరేళ్ల సర్వీసులో, అందులోనూ రెండేళ్ల సస్పెన్షన్ కాలం పోను, కేవలం నాలుగేళ్లలోనే ఆమె సృష్టించిన ప్రకంపనలు అన్నీ ఇన్నీ కావు. తాజాగా ఏసీబీ దాడుల్లో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్ట్ అయ్యి, 14 రోజుల రిమాండ్‌కు వెళ్లడంతో ఆమె అప్రతిహత ప్రస్థానానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది.2020లో దేవాదాయ శాఖలో అసిస్టెంట్ కమిషనర్‌గా చేరిన కళింగరి శాంతికి, అప్పటి అధికార పార్టీలో కీలక నేతగా ఉన్న విజయసాయి రెడ్డితో పరిచయం ఏర్పడింది. ఆ రాజకీయ అండతో ఆమె అటు ఉద్యోగ పరంగా, ఇటు వ్యక్తిగత జీవితంలోనూ తీవ్ర వివాదాలకు కేంద్రబిందువైంది. భర్త మదన్ మోహన్‌తో విడాకులు తీసుకోకుండానే మరొకరితో సహజీవనం చేయడం, ఒక బిడ్డకు జన్మనివ్వడం వంటి అంశాలు అప్పట్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీశాయి. ఆ బిడ్డ తండ్రి ఎవరనే విషయంలో భర్త మదన్ మోహన్ చేసిన ఆరోపణలు, విజయసాయి రెడ్డికి డీఎన్ఏ పరీక్షలు చేయాలన్న డిమాండ్లు అప్పట్లో సంచలనం సృష్టించాయి.శాంతి అధికార దర్పం ఏ స్థాయిలో ఉండేదంటే, విశాఖపట్నంలో పనిచేస్తున్న సమయంలో తన పై అధికారి అయిన డెప్యూటీ కమిషనర్ పుష్పవర్ధన్ గదిలోకి చొరబడి

### కళింగిరి శాంతి ప్రస్థానం

ఆయనపై ఇసుక చల్లడం ఆమె బరితెగింపునకు పరాకాష్ట. ఒక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేసినందుకు నిరసనగా ఆమె ఈ చర్యకు పాల్పడటం గమనార్హం.ఈ ఘటన సీసీటీవీలో రికార్డ్ అయినప్పటికీ, విచారణాధికారి తప్పు పట్టినప్పటికీ, ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకోకుండా, ఫిర్యాదు చేసిన పై అధికారిని బదిలీ చేయడం వ్యవస్థల నిర్వీర్యానికి నిదర్శనం. దీంతో మనస్తాపం చెందిన డెప్యూటీ కమిషనర్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది.విశాఖలో పని చేస్తున్న సమయంలో 'ప్రేమ సమాజం' భూములు, ఇతర దేవాదాయ భూముల లీజుల వ్యవహారంలో ఆమెపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. 2024 జూన్‌లో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆమెను సస్పెండ్ చేసినప్పటికీ, రాజకీయ ఒత్తిళ్ల వల్ల ఆమెను డిస్మిస్ చేసే ఫైల్ ముందుకు కదలలేదనే విమర్శలు ఉన్నాయి. కోర్టు ఆదేశాలతో మార్చి చివరి వారంలో తిరిగి పోస్టింగ్ పొందిన శాంతి, పది రోజులు గడవకముందే ఏసీబీ వలలో చిక్కుకుంది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారనే అభియోగంపై ఏసీబీ ఆమెను అరెస్ట్ చేసి జైలుకు పంపింది.శాంతి ఉదంతం రెండు ముఖ్యమైన పాఠాలను నేర్పుతుంది. రాజకీయ నాయకుల మద్దతు ఉంటే చట్టాన్ని, నిబంధనలను అతిక్రమించవచ్చనే ధీమా అధికారులను ఎంతటి పతనానికి తీసుకెళ్తుందో శాంతి జీవితం ఒక హెచ్చరిక. ఒక జూనియర్ అధికారి ఇంతగా రెచ్చిపోతున్నా.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం ఆమె విషయంలో నిర్ణయాత్మక చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యాయి. కోర్టు ఆదేశాలు ఇచ్చే వరకు లేదా ఏసీబీ దాడులు జరిగే వరకు వేచి చూడటం వ్యవస్థల బలహీనతను సూచిస్తుంది.మొత్తానికి, దేవాదాయ శాఖలో పవర్ ఫుల్ వుమెన్‌గా చలామణీ అయిన కళింగరి శాంతి ప్రస్థానం ప్రస్తుతం జైలు ఊచల వెనక్కి చేరింది. అధికార గర్వం, అవినీతి వెరసి ఒక అధికారి జీవితాన్ని అగాధంలోకి నెట్టేస్తాయో చెప్పడానికి ఈ స్టోరీ ఒక సాక్ష్యం.

# తిరుపతిలో 10 అంతస్తుల్లో బస్ స్టాండ్

తిరుపతి, ఏప్రిల్ 9, తిరుపతికి శ్రీవారి దర్శనం కోసం నిత్యం భారీగా భక్తులు తరలివస్తుంటారు. ఈ మేకు భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు నగరంలో ప్రస్తుతం ఉన్న బస్టాండ్ స్థానంలో ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టుకు రూ.470 కోట్లు ఖర్చువుతుందని అంచనా వేశారు. ఈ బస్ టెర్మినల్ నిర్మాణాన్ని ఈపీసీ విధానంలో నిర్మించాలని అధికారులు నివేదికను పంపారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తిరుపతిలో మౌలిక వసతుల్ని మరింత మెరుగుపరిచేందుకు సిద్ధమైంది. తిరుమల శ్రీవారి దర్శనం కోసం నిత్యం వేలాదిమంది భక్తులు తిరుపతికి వస్తుంటారు. ఈ క్రమంలో తిరుపతిలో మరిన్ని మౌలిక వసుతల్ని కల్పించే దిశగా ప్రణాళిక రూపొందించింది. తిరుపతిలో ప్రస్తుతం ఉన్న మెయిన్ బస్టాండ్ స్థానంలో కొత్తగా ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ నిర్మించాలని నిర్ణయం తీసుకోగా.. తాజాగా దీనికి సంబంధించి కీలక ముందడుగు వేసింది. తిరుపతి ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్‌కు ఈపీసీ (ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, కన్‌స్ట్రక్షన్) విధానంలో నిర్మించాలని తేల్చారు.తిరుపతిలో ప్రస్తుతం ఏపీఎస్ఆర్టీసీకి చెందిన బస్టాండ్ స్థలంలో.. ఎన్‌హెచ్ఎల్ఎంఎల్ (నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్) బస్ టెర్మినల్‌ను రూ.470 కోట్ల అంచనాతో ప్లాన్ చేశారు. ఈ టెర్మినల్ నిర్మాణానికి సంబంధించి మూడు విధానాలను (బీవోటీ, హామ్, ఈపీసీ) అధ్యయనం చేశారు. వాటిలో ఈపీసీ బావుంటుందని ప్రభుత్వానికి ప్రతిపాదనల్ని కూడా పంపారు. తిరుపతి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్, తిరుమల, ఆ చుట్టుపక్కల ఉన్న ఆలయాలకు వెళ్లే భక్తులకు ఈ టెర్మినల్ కీలకంగా మారింది.. అందుకే దీనికి ఇంటర్ మోడల్‌గా పేరు పెట్టారు. ఇంటర్ మోడల్ బస్ టెర్మినల్ డీపీఆర్ తయారు చేసేందుకు రైట్స్ (రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనమిక్ సర్వీస్ లిమిటెడ్)ను సలహా సంస్థగా నియమించారు.ప్రస్తుతం ఉన్న తిరుపతి బస్టాండ్, డిపో కలిపి మొత్తం 13.18 ఎకరాల్లో ఉంది. ఇందులో 7.11 ఎకరాల్లో ఈ బస్ టెర్మినల్ ప్లాన్ చేశారు. రోడ్డు పక్కన ఉన్న 4.29 ఎకరాలను కమర్షియల్‌గా అభివృద్ధి చేయనున్నారు.99 సెంట్ల భూమిని రోడ్డు కోసం, 79 సెంట్ల భూవిని ఫ్లై ఓవర్ కోసం నిర్మించనున్నారు. బస్ టెర్మినల్‌లో పార్కింగ్ కోసం సెల్లార్‌లో రెండు అంతస్తులు ప్లాన్ చేశారు. ఇలా ఆయ సదుపాయాల కోసం భూమిని కేటాయించారు. ప్రస్తుత ప్లాన్ ప్రకారం గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం టెర్మినల్‌కు కేటాయిస్తారు. మొత్తం 98 ప్లాట్‌ఫామ్‌ల నిర్మాణం.. టెర్మినల్ ప్రాంగణంలో మరో 50 బస్సులు నిలిపేందుకు వీలుగా స్థలం కేటాయించనున్నారు.టెర్మినల్ గ్రౌండ్ ఫ్లోర్ పైన 10 అంతస్తులు నిర్మించి కమర్షియల్ (హోటళ్లు, రెస్టారెంట్లు, డార్మెటరీలకు, మిగిలిన షాపులకు) కేటాయిస్తారు. అంతేకాదు టెర్మినల్‌లోని పదో ఫ్లోర్‌లో హెలీప్యాడ్ నిర్మించాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ టెర్మినల్ నుంచి బస్టాండ్, రైల్వే స్టేషన్‌ను కనెక్ట్ చేసేందుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించనున్నారు. ఇటీవల అధికారులు ఈ ప్రాజెక్టులో పెట్టుబడి పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నవారితో అధికారులు మాట్లాడారు.. వారి నుంచి అభిప్రాయాలసేకరించి పభుత్వానికి నివేదిక పంపించనున్నారు. కమర్షియల్‌గా కేటాయించబోయే వాటితో లాభాల పరిస్థితి.. ఆర్టీసీకి ఎంత ఇస్తారు, ఒప్పందం ఎన్నేళ్లు అనే అంశాలు తెలియాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న బస్టాండ్‌ను మరో చోటికి తరలిస్తే 5 ఎకరాల భూమి, డిపో కోసం మరో ఐదు ఎకరాలు తాత్కాలికంగా కేటాయించాలని ఆర్టీసీ జిల్లా కలెక్టర్‌ను కోరింది.

# కర్నూలులోనే మూడు ప్రధానా కార్యాలయాలు

కర్నూలు, ఏప్రిల్ 9, కర్నూలులోని రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ అమరావతికి తరలించాలని దాఖలైన పిల్‌ను హైకోర్టు కొట్టేసింది. వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతిలో కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు కోర్టుకు లాయర్ తెలిపారు. మరోవైపు లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ కార్యాలయాలను కూడా కర్నూలులోనే కొనసాగిస్తామని ప్రభుత్వం తెలిపింది. 2021లో కార్యాలయాల తరలింపు పిల్‌లు దాఖలయ్యాయి. తాజాగా ప్రభుత్వ క్లారిటీ ఇవ్వడంతో ఈ మూడు ముఖ్యమైన కార్యాలయాలు కర్నూలులోనే కొనసాగనున్నాయి.కర్నూలులోనే వక్ఫ్ ట్రైబ్యునల్, లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ) కార్యాలయాలు కొనసాగుతాయని ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఏపీ హైకోర్టులో రాష్ట్ర వక్ఫ్ ట్రైబ్యునల్ తరలింపుపై పిల్ దాఖలైంది.. కర్నూలలో ఉన్న వక్ఫ్ ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించేలా ఆదేశాలు ఇవ్వాలని 2021లో సామాజిక కార్యకర్త మహ్మద్ ఫరూఖ్ షిబ్లి హైకోర్టును కోరారు. ట్రైబ్యునల్ మినహా వక్ఫ్‌బోర్డు, తదితర మైనారిటీ సంస్థలన్నీ విజయవాడలో ఉన్నాయని పిటిషనర్ తరపు లాయర్ కోర్టులో వాదనలు వినిపించారుపరిపాలనా సౌలభ్యం కోసం ట్రైబ్యునల్‌ను అమరావతికి తరలించాలని పిటిషనర్ తరపు లాయర్ కోరారు. వక్ఫ్ సంస్థలు, ఆస్తులు, వివాదాలకు సంబంధించిన ఎక్కువ కేసులు కర్నూలుతో పాటుగా చుట్టుపక్కల జిల్లాల్లో ఉన్నాయని ప్రభుత్వం తరఫున లాయర్ వాదించారు. హైకోర్టు కూడా వక్ఫ్ ట్రైబ్యునల్ కర్నూలులో ఉండటంలో న్యాయం ఉందని అభిప్రాయపడింది.. ఈ మేరకు షిబ్లీ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం కొట్టేసింది.అంతేకాదు కర్నూలు నుంచి అమరావతికి హెచ్‌ఆర్సీ, లోకాయుక్తలను తరలించాలని 2021లో హైకోర్టులో పిల్‌లు దాఖలయ్యాయి. ఈ క్రమంలో తాజాగా కర్నూలులో ఉన్న మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ), లోకాయుక్త అంశంపై ఏపీ ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ రెండు కార్యాలయాలను కర్నూలులోనే కొనసాగించాలని నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం తరఫున లాయర్ కోర్టుకు తెలిపారు. మానవ హక్కుల కమిషన్ (హెచ్‌ఆర్సీ)లో ఏపీ, తెలంగాణ మధ్య సిబ్బంది విషయమై విభజన జరగాల్సి ఉందన్నారు.ఇటు లోకాయుక్తను కూడా త్వరలో నియమిస్తామని తెలిపారు. ప్రభుత్వ తరఫు లాయర్ కోర్టుకు తెలిపిన వివరాలను పరిగణనలోకి తీసుకుని విచారణను వాయిదా వేసింది. గత ప్రభుత్వ హయాంలో లోకాయుక్త, హెచ్‌ఆర్సీ కార్యాలయాలను కర్నూలుకు తరలించారు. అయితే ఈ రెండు కార్యాలయాలను అమరావతికి తరలించాలని హైకోర్టులో ప్రజాప్రయోజన వాజ్యాలు దాఖలయ్యాయి.. వాటిపై హైకోర్టు విచారణ చేస్తోంది. అంతేకాదు కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు అంశం కూడా తెరపైకి వచ్చిన సంగతి తెలిసిందే.

# మామిడి రైతులపై యుద్ధ ప్రభావం



విజయవాడ, ఏప్రిల్ 9, భారత్‌లో మామిడి సీజన్ ప్రారంభమైందంటే ఎగుమతిదారులలో ఎంతో ఉత్సాహం కనిపిస్తుంది. కానీ, 2026 ఏప్రిల్ నెలలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పశ్చిమాసియాలో ముఖ్యంగా ఇరాన్ ప్రాంతంలో కొనసాగుతున్న యుద్ధం కారణంగా భారతీయ మామిడి ఎగుమతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. మేలైన రకాలపై ఆల్ఫాన్సో, కేసర్, మన తెలుగు రాష్ట్రాల్లోప్రసిద్ధి చెందిన బంగినపల్లి వంటి రకాల ఎగుమతులకు ఈ యుద్ధం పెద్ద అడ్డంకిగా మారింది. రెండు నెలలుగా కొనసాగుతున్న యుద్ధం కారణంగా హర్మూజ్ జలసంధిని ఇరాన్ దిగ్బంధించింది. దీనికి తోడు ఎర్ర సముద్రంలో నెలకొన్న అలజడుల వల్ల ప్రధాన షిప్పింగ్ లైన్లు తమ నౌకలను కేప్ ఆఫ్ గుడ్ హోప్ మీదుగా మళ్లించాల్సి వస్తోంది. ఈ మార్పు వల్ల ప్రయాణం కాలం విపరీతంగా పెరగడమే కాకుండా ఓడరేవుల్లో రద్దీ పెరిగి కంటైనర్లు సకాలంలో తిరిగి రావడం లేదు. మామిడి వంటి త్వరగా పాడైపోయే పండ్ల రవాణాకు రీఫర్ అని పిలిచే రిఫ్రిజిరేటెడ్ కంటైనర్లు అత్యవసరం. ఈ కంటైనర్లలో ఉష్ణోగ్రతను కచ్చితంగా 11 నుంచి 18 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంచాలి. భారత్ సొంతంగా ఈ రీఫర్ కంటైనర్లను తయారుచేయదు. మనం పూర్తిగా అంతర్జాతీయ షిప్పింగ్ లైన్లపైనే ఆధాపడుతున్నాం. యుద్ధం కారణంగా ఈ కంటైనర్ల రాకపోకలు మందగించడంతో ప్రస్తుతం మార్కెట్‌లో వీటి కొరత తీవ్రంగా ఉంది. యుద్ధం కారణంగా రవాణా రంగంపై పడిన ఆర్థిక భారం సామాన్యులనుగ్రాంతికి గురి చేస్తోంది. గల్ఫ్ దేశాలకు వెళ్లే సముద్ర రవాణా ఛార్జీలు కొన్ని మార్గాల్లో ఏకంగా 8 రెట్లు పెరిగాయి. యుద్ధం ఉన్న ప్రాంతాల గుండా ప్రయాణించే నౌకలపై బీమా ఛార్జీలు, అదనపు పన్నులు భారీగా పెరిగాయి. కేవలం మార్చి నెలలోనే రీఫర్ కంటైనర్ల ఛార్జీలు వెయ్యి డాలర్లు వరకు పెరిగాయి. కొన్ని మార్గాల్లో సుమారు నాలుగువేల డాలర్ల వరకు అదనపు పన్నులు విధిస్తున్నారు. ఇది సాధారణ రవాణా ఖర్చు కంటే దాదాపు నాలుగు రెట్లు ఎక్కువ. ప్రపంచ మామిడి ఉత్పత్తిలో భారత్ అగ్రగామిగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా పండే మామిడిలో 44 శాతం అంటే సుమారు 20.68 మిలియన్ టన్నులు భారత్ నుంచే వస్తున్నాయి. 2025 ఆర్థిక సంవత్సరంలో భారత్ 56.5 మిలియన్ డాలర్ల విలువైన 29,938 టన్నుల తాజా మామిడి ఎగుమతి చేసింది. మన ఎగుమతుల్లో 40 శాతం నుంచి 45 శాతం వాటా గల్ఫ్ దేశాలదే. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉండే పీక్ సీజన్‌లో ఎగుమతిదారులకు ఇప్పటికే భారీ ఆర్డర్లు ఉన్నాయి. మామిడి పండు కోసిన తర్వాత కేవలం 28 రోజులు మాత్రమే నిల్వ ఉంటుంది. సముద్ర మార్గంలో ప్రయాణ కాలం పెరగడం వల్ల పండ్లు గమ్యస్థానానికి చేరే లోపే పాడైపోయే ప్రమాదం ఉంది. దీని వల్ల ఎగుమతిదారులు విమాన రవాణాను ఎంచుకోవాల్సి వస్తోంది.

# 'మావిగన్ జోకర్'గా జగన్ మిగిలారు.. షర్మిల సెటైర్లు




అమరావతి, ఏప్రిల్ 9 వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు షర్మిల షాకింగ్ కామెంట్స్ చేశారు. వైఎస్సార్ తన జీవిత కాలం వ్యతిరేకించిన బీజేపీకి దత్తపుత్రుడుగా జగన్ మారారని ఎద్దేవా చేశారు. వైసీపీ హయాంలో మూడు రాజధానుల పేరుతో రుషికొండ మింగేసి సొంతానికి ప్యాలెస్‌లు కట్టుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు 'మావిగన్ జోకర్'గా జగన్ మిగిలారని సెటైర్లు గుప్పించారు. సంక్షేమానికి సారథి దివంగత నేత వైఎస్సార్ అని కొనియాడారు. ఆయన ప్రతీ పథకం ప్రజల కష్టం, కన్నీళ్ల నుంచి పుట్టిందేనని వ్యాఖ్యానించారు. ఈ మేరకు షర్మిల ఓ ప్రకటన విడుదల చేశారు.

వైఎస్సార్ ప్రజాప్రస్థానం పదిలం..కాంగ్రెస్ నాయకుడు, మా నాన్న వైఎస్సార్ ప్రజాప్రస్థానం తెలుగు ప్రజల గుండెల్లో ఈరోజుకి పదిలమని షర్మిల చెప్పుకొచ్చారు. ఏప్రిల్ 9, 2003లో చేవెళ్ల నుంచి ఇచ్ఛాపురం దాక ప్రజాహితమే పరమావధిగా వైఎస్సార్ చేపట్టిన1457 కిలోమీటర్ల పాదయాత్ర సాగిందని తెలిపారు. ఈ పాదయాత్రకు 23 ఏళ్లని చెప్పారు. వారసులమని చెప్పుకునే జగన్ మోహన్ రెడ్డి వైఎస్సార్ పేరును వాడుకున్నారు తప్పితే.. ఆయన ఆశయాలకు వారసులు ఎందుకు కాలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. వైసీపీలో నిజంగా వైఎస్సార్ ఐడియాలజీ ఉంటే జగన్ సీఎం అయ్యాక కూడా వైఎస్సార్ జలయజ్ఞాన్ని ఎందుకు పూర్తి చేయలేదు..? అని నిలదీశారు.'మాటతప్పంమడమతిప్పం' అనే వైఎస్సార్ లైన్ వాడుకోవడం తప్పిస్తే, పూర్తి మద్యపాన నిషేధమని మాట ఇచ్చి, కల్తీ మద్యం అమ్మి 'ఓన్లీ క్యాష్' మాఫియా ఎందుకు చేశారు? అని షర్మిల ప్రశ్నించారు.

# చనిపోయిన తర్వాత మనిషిని కొన్ని ప్రదేశాల్లో ఏం చేస్తారో తెలుసా..?



మనిషి చనిపోయిన తర్వాత మనమైతే మన ఆచార సాంప్రదాయం ప్రకారం పూడ్చడమో, కాల్చడమో చేస్తాం, కానీ కొన్ని ప్రాంతాల్లో అంత్యక్రియల తంతు వింతవింతగా చేస్తారు. అదే అక్కడ అనాదిగా వస్తున్న ఆచారం.! కొన్ని దేశాలల్లో అయితే శవాలను మమ్మీలుగా అలానే ఉంచుతారు. ఇంకొన్ని దేశాలలో మృత దేహాన్ని అంత్యక్రియలు చేసేటప్పుడు తల భాగాన్ని వేరు చేసి కేవలం మొండెం వరకే కాల్చివేస్తారు.తలను గుహల్లో రాళ్ల మధ్యలో ఉంచుతారు. చనిపోయిన శవం వృధాకాకుండా ఆకలితో ఉన్న పక్షులకు ఆహారంగా ఇచ్చే ఆచారం కూడా ఉంది. ఇలా ప్రపంచవ్యాప్తంగా మనం వినని చూడని కొన్ని అంత్యక్రియ పద్ధతుల గురించి తెలుసుకోండి. ఖనీలివతీవట ఎఎ సతి సహగమనం: సతి సహగమనం హిందుమతంలో ఇది చాలా పురాతన సంప్రదాయం. ఈ విధానంను ప్రస్తుత రోజుల్లో చాలా అరుదగా అనుసరిస్తున్నారు . భర్త చనిపోయిన తర్వాత భార్యకు ఇచ్చే ఒక రకమైనటువంటి పనిష్మెంట్ . విధవంగా ఉండటకుండా, భర్తను కాల్చే చితిలో ఆమెను కూడా తగలబెడుతారు. ఆమెతంట ఆమె చితిలో పడి కాల్చుకొనేలా భలవంతం చేస్తాచి. అందకు ప్రధాణ కారణం భర్త చనిపోయిన తర్వాత భార్యకు ఈ ప్రపంచంలో చోటు లేదాని , అతని కోసం ఆమె త్యాగం చేయాల్సిందేనన్న సంప్రదాయం మన హిందు మతంలో ఉండేది.. ఖననం చేయడం: మనదేశంలో చాలావరకు మతాలు చనిపోయిన మృతదేహాలను మట్టిలో పూర్చిపెట్టి సమాధులు కడతారు. వేద కాలం నుండి ఈ ఆచారాన్ని పాటిస్తున్నారు. ఇస్లాం మరియు క్రిస్టియన్ మతస్థులు ఇదే ఆచారాన్ని అంత్యక్రియలలో పాటిస్తున్నారు. ఎఎజీణవ అనీబీతీబివబఎ మమ్మీలు:



చనిపోయిన మృతదేహాలకు బట్టలుకట్టి, ఆ శవాలను కాల్చివేయకుండా, పూర్చకుండా ఒక పెట్టెలో బంధిస్తారు. ఈజిప్ట్ దేశీయులు ఈ ఆచారాన్ని ఎక్కువగా వ్యవహరిస్తారు.ఈజిప్ట్ లో ఇప్పటివరకూ 3500పైగా మమ్మీలు ఉన్నాయట. ఇలా చేయడం వల్ల ఆ మమ్మీలు ఏదో ఒకరోజు తిరిగి బ్రతుకుతారని వారి ప్రగాడ విశ్వాసం. ఈ పద్ధతి కేవలం ఒక్క ఈజిప్ట్ కె పరిమితం కాలేదు, భారత్, శ్రీలంక, చైనా, టిబెట్, థాయిలాండ్ దేశాలలో ఈ ఆచారాన్ని ఫాలో అవుతూ అంత్యక్రియలు జరుపుతున్నారు. కొండ చివరపు అంచున ఉరితీయడం: చైనీయుల మత ఆచారంలో చనిపోయిన ఇలా కొండ చివరన రెండు చెక్కల మధ్యన లేదా ఒక రాయికి వేలాడదీసి ఉరితీస్తారట. అలా చేయడం వలన వారు స్వర్గానికి వెళతారని వారి విశ్వాసం.కాల్చివేయడం: హిందూమత ఆచారం ప్రకారం మృతదేహాన్ని ఎలా అంత్యక్రియలు చేయాలనే దాన్ని అయిదు అంశాలను పరిగణలోకి తీసుకొని పూర్తిచేస్తారు. అందులో ఇలా కట్టెలపై కాల్చివేయడం ఒక పద్ధతి. కొన్ని శతాబ్దాల నుండి ఈ ఆచారం అమలులో ఉంది. ఎఎజీణవ అనీబీతీబివబఎ పక్షులకు ఆహారంగా: ఇతర మతాల ఆచారాల ప్రకారం పూడ్చడం, దహనం లాంటివి చేయకుండా పర్సియన్ దేశస్థులు చనిపోయిన శవాలను పక్షులకు, రాబందులకు ఆహారంగా వేస్తారు. ఆ శవం వృధా




కాకుండా పక్షుల ఆకలి తీర్చడానికి ఉపయోగపడుతుందని ఈ విధంగా చేస్తారట. ప్రస్తుతం ఈ పద్ధతి అక్కడ చాలావరకు తగ్గిందనే చెప్పాలి. రాబందులు కూడా చాలా వరకూ తగ్గిపోవడంతో,,, అక్కడి శవాలను సోలార్ ప్లేట్లు శవంపై ఉంచుతున్నారు. సోలార్ ప్లేట్ల వేడికి ఆ శవాలు అలా దహనమవుతాయి. ఎఎజీణవ అనీబీతీబివబఎ గర్భిణీలు "తులసీ టీ " తాగడం వల్ల పొందే గొప్ప ప్రయోజనాలు వేప, పెరుగు మిక్స్ ని ఫేస్ కి పట్టిస్తే పొందే అమేజింగ్ బెన్ఫిట్స్..!! ఒక్క నెలలో బాడీ వెయిట్ కంట్రోల్, బెల్లీ ఫ్యాట్ కరిగించే 7 అమేజింగ్ ఫ్రూట్స్ ఈవజీబిబీతీవట ఖనీబబిబ శవాలను తినడం: న్యూగినియా మరియు బ్రెజిల్ దేశాలలో అక్కడి ప్రజలు మృతదేహాలను చాలా వింత పద్ధతిలో అంత్యక్రియలు జరుపుతారు. ఆ చనిపోయిన శవాలను ముక్కలుగా చేసుకొని భుజిస్తారు. ప్రస్తుతం ఈ పద్ధతి అక్కడ చాలా అరుదనే చెప్పాలి. సముద్రంలో వేయడం: దక్షిణ అమెరికాలోని ఓ ప్రాంత ప్రజలు చనిపోయిన మృతదేహాలను సమృద్ధిగా పారుతున్న నదులలో లేదా సముద్రాలలో ఆ శవాలను పడేసి అంత్యక్రియలు జరుపుతారట. ఎఎజీణవ అనీబీతీబివబఎ గుహల్లో ఉంచడం: ఇరాక్, ఇజ్రాయిల్ దేశాలలో చనిపోయిన వ్యక్తులను ఊరికి చివరన గుహలలో వదిలివేసేవారట. ఆ శవాలను అలా





ఉంచడానికి పెద్ద పెద్ద రాళ్ళను ఉపయోగిస్తారట. గొంతు నులిపివేయడం: ఒకప్పుడు మనదేశంలో భర్త చనిపోయిన తర్వాత భార్య కూడా చనిపోవాలని ఆమెను మంటల్లోకి తోసేవారు. (సతీసహగమనం). సేమ్ టు సేమ్ అలాంటి పద్ధతే దక్షిణ పసిఫిక్ లోని ఫిజి ప్రాంతంలో పాటిస్తున్నారు. ఎవరైనా తమ కుటుంబంలోని వ్యక్తి చనిపోతే, ఆ శవం ఒంటరిగా వెళ్ళకూడదట. అందుకని ఆ కుటుంబంలోని ఎవరైనా సరే ఒకరు వారితో తాడు లేదా ఏదైనా బట్టను ఉపయోగించి గొంతును నులిపివేస్తారు. అలా గొంతునులిపి వేసే సమయంలో వారు ఎలాంటి బాధను అనుభవించరని, వారి ఆత్మకు శాంతి కలుగుతుందని వారి నమ్మకం.



## కరివేపాకు సాగులో మెలకువలు



నీరు నిల్వని తేలికపాటి గడవనేలలు, మురుగునీటి పారుదల వసతి గల ఒండ్రు నేలలు ఈ పంటకు అనువైనవి. రకాలు..... దేశవాలి రకాల్లో ముదురాకు పచ్చ లేదా లేతాకు పచ్చ రంగులో అకులు కాడలున్న మొక్కలుంటాయి. సువాసిని వేరు మొక్కలు ద్వారా మాత్రమే వ్యాప్తిం చెందుతుంది. మొట్ట ప్రాంతానికి అనుకూలం, భువనేశ్వర్...నీటి పారుదల ప్రాంతాల్లో ఎక్కువుగా సాగుచేస్తున్నారు. నారుపెంప కం...విత్తనాలను సేకరించిన వెంటనే విత్తుకోవాలి. ఆలస్యమయితే మొలకశాతం తగ్గుతుంది. నారు మడులను ఒక మీటర్/ ఒక మీటర్× 15 సెంటిమీటర్ల ఎత్తులో తయారు చేసి వరుసల్లో పదిసెంటిమీటర్ల వెడల్పుతో విత్తనాలను విత్తుకోవాలి. గడ్డి కప్పి రోజుకు రెండుసార్లునీరు చల్లాలి. పదిహేను నుండి 20 రోజుల రోజుల్లో విత్తనాలు మొలకెత్తుతాయి. మూడునెలల వయస్సు మొక్కలను పొలంలో నాటుకోవాలి. నేల తయారి..నేలను నాలుగైదు సార్లు దున్నాలి, ఎకరాకు ఎనిమిది టన్నుల పశువుల ఎరువు 26 కిలోల నత్రజని, 9 కిలోల భాస్వరం, 9 కిలోల పోటాష్ వేయాలి. నారు నాటటానికి ముందుగా 30×30×30ె ంటిమీటర్ల గుంటలను 1,2-1,5 మీటర్ల ఎడంగా తీయాలి. దుబ్బ నేలల్లో అయితే 90×90 సెంటిమీటర్ల ఎడం సరిపోతుంది. మొక్కలు నాటిని ఆరు నెలల తర్వాత రెండోదఫ 8 కిలోల నత్రజని వేయాలి. కార్సి పంటలను రెండో ఏడాదిలో 8 కిలోల నత్రజని, 20కిలోల భాస్వరం వేయాలి. ప్రతి మొక్కకు 20 కిలోల పశువుల ఎరువువు వేయాలి. మొక్కలు నాటిని వెంటనే బోదెల ద్వారా నీరు పెట్టాలి. వారానికి ఒకసారి నీరు ఇవ్వాలి. కరివేపాకు తోటల్లో అంతర్ పంటలుగా పప్పు దాన్యాలు, ఆకుకూరలను సాగుచేసుకోవచ్చు. కరివేపాకు మొక్కలు ఒక మీటర్ ఎత్తు పెరిగిన తర్వాత చివర్లు తుంచి పక్క కొమ్మలు ఎక్కువుగా రావటానికి అవకాశం కల్పించాలి. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు తీసి వేయాలి. సస్యరక్షణ...కరివేపాకు ఆకులను గొంగలి పురుగులు తిని నష్టాన్ని కలిగిస్తాయి . వీటి నివారణకు మలాధీయాన్ రెండు మిల్లిమీటర్లు లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలి. ఆకు మచ్చ తెగుళ్ల నివారణకు ఒక గ్రాము కార్బన్ బిజం, లీటర్ నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. కోత, దిగుబడి....మొదటి ఏడాది నాటిన పది నుండి పన్నెండు నెలల్లో కొతకు వస్తుంది. ఎకరాకు వందనుండి 160 కిలోల దిగుబడి వస్తుంది. రెండో ఏడాది ప్రతి నాలుగు నెలలకు ఒకసారి 700కిలోల చొప్పున ఎకరాకు ఏడాదిలో 2100 కిలోల దిగుబడి వస్తుంది. మూడు, 4 ఏడాది ప్రతి మూడు నెలలకు ఒకసారి రెండువేల కిలోల చొప్పున ఏడాదికి ఎకరాకు 8వేల కిలోల దిగుబడి వస్తుంది.

## పరకడుపున ఈ జ్యూస్ తాగారంటే.. ఖచ్చితంగా బరువు తగ్గుతారు..!



*బరువు తగ్గడానికి చాలా విభిన్న పద్ధతులు ఉన్నాయి. వ్యాయామం, డైట్ వంటివి బరువు తగ్గడానికి సహాయపడతాయి. అయితే.. వీటిని ఫాలో అవడానికి చాలా మంది ఇష్టపడరు. ఎఫెక్టివ్ గా ఫాలో అవలేకపోతారు. అందుకే.. సింపుల్ సొల్యూషన్ కోసం ఎదురుచూస్తుంటారు. ఖనీలివతీవట ఎఎ వ్యాయామం, డైట్ ఫాలో అవడానికి లేజీగా ఫీలయ్యే వాళ్లు.. చాలా ఎఫెక్టివ్ రెమిడీ ఒకటి ఉంది. తేలికగా బరువు తగ్గడానికి, వ్యాయామానికి తీరిక లేకుండా.. కంప్యూటర్ల ముందు కూర్చుని వర్క్ చేసేవాళ్లకు బరువు తగ్గడానికి.. సహాయపడే డ్రింక్ ఉంది. మొదట్లో దీన్ని తాగడానికి కాస్త ఇబ్బంది పడినా.. రెగ్యులర్ గా తీసుకుంటూ ఉంటే.. ఖచ్చితంగా ఫలితాన్ని చూస్తారు. ఈ డ్రింక్ తాగడం వల్ల మెటబాలిజం చాలా వేగంగా.. పెరిగి.. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. కావాల్సిన పదార్థాలు 2టీస్పూన్ల తేనె 1 టీస్పూన్ చెక్క 1 కప్పు నీళ్లు. తయారు చేసే విధానం ముందుగా ఒక కప్పు నీటిని.. ఉడికించాలి. తర్వాత.. అందులో దాల్చిన చెక్క పొడి వేసి.. దానిపై ప్లేట్ పెట్టాలి. తాగడానికి వీలుగా ఉండే వేడి ఉన్నప్పుడు.. తేనె మిక్స్ చేయాలి. తేనె మిక్స్ చేసేటప్పుడు చాలా వేడిగా ఉండకూడదు. ఈ మిశ్రమంలో సగ భాగాన్ని రాత్రి నిద్రపోయే ముందు, మరో సగంను.. మరుసటి రోజు ఉదయం నిద్ర లేచిన తర్వాత తీసుకోవాలి. అంతవరకు దాన్ని ఫ్రిడ్జ్ లో పెట్టుకోవచ్చు. అయితే.. ఉదయం ఖాళీ కడుపుతో*



## బ్రేక్ ఫాస్ట్ లో ఇవి ఎంపిక చేసుకోండి...ఎఫెక్టివ్ గా బరువు తగ్గించుకోండి..!!



బరువు తగ్గించుకొనే ప్లాన్ లో ఉన్నారా? మరియు బరువు తగ్గించుకోవడానికి ప్లాన్ ఏంటి?మీకు తెలియకపోతే, చింతించాల్సిన అవసరం లేదు మీరు ఆరోగ్యంగా బరువు తగ్గడానికి కొన్ని సలహాలివ్వడానికి మేమున్నాం. బరువు తగ్గాలంటే, ముందుగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలి. డైట్ ప్లాన్ చాలా ఎఫెక్టివ్ గా బరువు తగ్గిస్తుంది. మీరు ఖచ్చితంగా కొన్ని కిలోల బరువు తగ్గించుకోవాలని నిజంగా మీరు కోరుకుంటున్నట్లైతే మీరు తీసుకొనే డైట్ మీద ప్రత్యేక శ్రద్ధ చాలా అవసరం. ముందుగా దినచర్యను ఒక హెల్తీ బ్రేక్ ఫాస్ట్ తో మీరు ప్రారంభించాలి. లచ్ మితంగా తీసుకోవాలి అలాగే



డిన్నర్ కూడా చాలా సింపుల్ మీల్స్ ను ఎంపిక చేసుకోవాలి. బరువు తగ్గించే క్రమంలో మీరు ఉదయం తీసుకొనే అల్పాహారం చాలా ఎఫెక్టివ్ గా పనిచేస్తుంది. అందువల్ల మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ గా తీసుకొనే ఆహారంలో అన్నిరకాల విటమిన్స్ , మినిరల్స్, ఫైబర్, కార్బోహైడ్రేట్స్ మరియు ఇతర న్యూట్రీషియన్స్ అన్నీ ఉండేట్లు చూసుకోవాలి. అదే విధంగామీరు తీసుకొనే ఈ హెల్తీ ఆహారాలు కూడా మీరు బరువు పెరగకుండా ఉన్నవి ఎంపిక చేసుకోవాలి మరి మన ఇండియన్ కుషన్స్ లో మీరు హెల్తీ వెయిట్ లాస్

బ్రేక్ ఫాస్ట్ ను తెలుసుకోవడం కష్టం అనిపిస్తే, ఇక్కడ మీకో శుభవార్త... మీరు ఎఫెక్టివ్ గా బరువు తగ్గడానికి మరియు రుచికరమైన బ్రేక్ ఫాస్ట్ రెండు ఒకే సారి ఎంపిక చేసుకోవడానికి కొన్ని బ్రేక్ ఫాస్ట్ ఐటెమ్స్ ఉన్నాయి. ఈ అల్పాహారాలు మీరు బరువు తగ్గడానికి చాలా సహాయపడుతాయి. అదే విధంగా ఈ బ్రేక్ ఫాస్ట్ ఐటమ్స్ పూర్తి పోషకాలు కలిగి ఉంటాయి. మరియు రుచికరంగా ఉంటాయి . మిమ్మల్ని ఆరోగ్యంగా ఉంచుతూ ఎఫెక్టివ్ గా బరువు తగ్గించే కొన్ని బ్రేక్ ఫాస్ట్ ఆప్షన్స్ క్రింది విధంగా. గుడ్డు: బరువు తగ్గించే ప్రోటీన్ ఫుడ్స్ లో శక్తివంతమైనది గుడ్డు. గుడ్డులోని పచ్చసొన కంటే తెల్ల సొన ఎక్కువగా తినడం వల్ల శరీరానికి ప్రోటీన్స్, క్యాల్షియం పుష్కలంగా



అంది, ఎనర్జినీ అందివ్వడంతో పాటు, బరువు తగ్గిస్తాయి. పెరుగు: ప్రోబయోటిక్ ఫుడ్స్ డైట్ లో ఎనర్జిటిక్ ఫుడ్స్ . అంతే కాదు బరువు తగ్గించడంలో కూడా ముఖ్యపాత్రపోషిస్తుంది. ఉదయం తీసుకోవడం వల్ల డైజెస్టివ్ ట్రాక్ శుభ్రపడుతుంది . దాంతో వ్యాధులను దూరం చేస్తుంది. పోహా(అటుకులతో తయారుచేసే అల్పాహారాలు) పోహా (అటుకులతో తయారుచేసే అల్పాహారాలు బ్రేక్ ఫాస్ట్ కు ఒక ఫర్ ఫెక్ట్ ఆప్షన్. ఇది మీ పొట్టలో తేలికగా ఉంచుతంది, చాలా తక్కువ క్యాలరీలను కలిగి ఉండే పోహా కళ్ళఆరోగ్యానికి చాలా మంచిది. కిచిడి మీ దినచర్యను ఆరోగ్యకరమైన కిచిడితో ప్రారంభించవచ్చు. ఇది ఒక బెస్ట్ బ్రేక్ ఫాస్ట్ ఐడియా. దాల్ కిచిడి లేదా బార్లీ కిచిడిని చాలా తక్కువ మాసాల దినుసులు, కారం తక్కువగా చేసుకుంటే, అంది మీకు మరింత ఎక్కువ పోషకాలను అందిస్తుంది. కిచిడి పొట్టనింపే బ్రేక్ ఫాస్ట్ ఆప్షన్. అంతే కాదు, ఇది ఖచ్చితంగా మిమ్మల్ని బరువు పెరగనివ్వదు. బ్రౌన్ రైస్: బ్రౌన్ రైస్ ను డైలీ డైట్లో చేర్చుకవోడం వల్ల బరువు తగ్గించుకోవచ్చు ప్రోటీనులు, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ ను కూడా బ్యాలెన్స్ చేసుకోచ్చు. ఒక్క నెలలో బాడీ వెయిట్ కంట్రోల్, బెల్లీ ఫ్యాట్ కరిగించే 7 అమేజింగ్ ఫ్రూట్స్ సాఫ్ట్ స్కిన్, గ్లోయింగ్ స్కిన్ పొందడానికి 10 హెర్బల్ టీ ఫేస్ మాస్క్ లు ఆకలి అవ్వడం లేదా? ఇవి తింటే ఖచ్చితంగా ఆకలి పెరుగుతుంది.



# స్పోర్ట్స్ న్యూస్

## కేఎల్ రాహుల్‌కు ఉన్న సమస్య అదే: అంబటి రాయుడు



ఢిల్లీ క్యాపిటల్స్ స్టార్ ఓపెనర్ కేఎల్ రాహుల్‌పై టీమిండియా మాజీ క్రికెటర్ అంబటి రాయుడు ప్రశంసల జల్లు కురిపించాడు. రాహుల్ క్రీజులో సెట్ అయితే దూకుడుగా ఆడగలడని కొనియాడాడు. అయితే రాహుల్‌కు ఉన్న ఏకైక సమస్య అతని మైండ్ సెట్టేనని అభిప్రాయపడ్డాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కేఎల్ రాహుల్(52 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 92)అసాధారణ బ్యాటింగ్ ప్రదర్శన కనబర్చిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ ఓడినా.. రాహుల్ బ్యాటింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఆరంభంలో చాలా స్లోగా ఆడిన రాహుల్.. ఆ తర్వాత బౌండరీలతో చెలరేగాడు. తొలి 17 బంతుల్లో 20 పరుగులే చేసిన రాహుల్.. ఆ తర్వాత గేర్ మార్చి 29 బంతుల్లోనే హాఫ్ సెంచరీ అందుకున్నాడు. కేఎల్ రాహుల్ బ్యాటింగ్‌పై ఈఎస్‌పీఎన్ క్రిక్ఇన్ఫో షోలో మాట్లాడిన అంబటి రాయుడు.. అతని బ్యాటింగ్‌ను ప్రత్యేకంగా కొనియాడాడు.'ఇన్నింగ్స్ ప్రారంభంలో కేఎల్ రాహుల్ జాగ్రత్తగా ఆడాడు. పిచ్‌ను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాడు. కానీ ఆ తర్వాత అద్భుతంగా చెలరేగాడు. బహుశా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టులో అతని పాత్ర అదే కావచ్చు. అతను ఇన్నింగ్స్ చివరి వరకు బ్యాటింగ్ చేయాలనేది వారి వ్యూహం అనుకుంటా. రాహుల్ ఒక్కసారి క్రీజులో సెట్ అయితే.. ఎలాంటి బంతినైనా బౌండరీకి పంపగల సామర్థ్యం అతనికి ఉంది.రాహుల్ ప్రత్యేకత కూడా అదే. అతనికి ఉన్న ఏకైక సమస్య మైండ్‌సెట్. ఎందుకంటే స్పిన్నర్లు, ఫాస్ట్ బౌలర్లు ఎలాంటి లెంగ్త్‌లో వేసినా ఎదుర్కొనే సత్తా అతనికి ఉంది. అతను ఏ వ్యూహంతో బ్యాటింగ్‌కు వస్తాడనేదే అసలైన సవాలు. ఈ రోజు అతను ఇన్నింగ్స్ చివరి వరకు బ్యాటింగ్ చేయాలనుకున్నాడు. ఆ పనిని అతను చాలా అద్భుతంగా చేశాడు. అతను ఒక అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడనే విషయాన్ని మర్చిపోవద్దు'అని అంబటి రాయుడు చెప్పుకొచ్చాడు.ఈ సీజన్‌ను డకౌట్‌తో ప్రారంభించిన రాహుల్.. రెండో మ్యాచ్‌లో ఒక్క పరుగు మాత్రమే చేసి ఔటయ్యాడు. మూడో మ్యాచ్‌లో మాత్రం విధ్వంసకర బ్యాటింగ్‌తో విశ్వరూపం చూపించాడు. గుజరాత్ చేతిలో ఓడినా.. రాహుల్ ఫామ్ అందుకోవడం ఢిల్లీ క్యాపిటల్స్‌కు సానుకూల అంశంగా మారింది. ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఢిల్లీ రెండు గెలిచింది. తమ తదుపరి మ్యాచ్‌లో ఏప్రిల్ 11న చెన్నై వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో తలపడనుంది.

## నితీష్ రెడ్డికి ఎలాంటి అమ్మాయిలు ఇష్టమో తెలుసా.. లేడీస్ గెట్ రెడీ..!!

టీమిండియా యువ క్రికెటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆల్‌రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి ప్రస్తుతం సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాడు. స్టేడియంలో తన మెరుపు బ్యాటింగ్, పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థులను వణికించే ఈ ఆంధ్ర కుర్రాడు.. తాజాగా తన వ్యక్తిగత విషయాలను పంచుకుని వార్తల్లో నిలిచాడు. ఓ ప్రైవేట్ ఇంటర్వ్యూలో తన భవిష్యత్తు, కెరీర్, తన జీవిత భాగస్వామికి ఉండాల్సిన లక్షణాల గురించి నితీష్ కుమార్ రెడ్డి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశాడు. ప్రస్తుతం ఈ వీడియో నెట్టింట విపరీతంగా ట్రెండ్ అవుతోంది.పెళ్లి గురించి ఇప్పుడే ఎటువంటి ఆలోచనలు లేవని స్పష్టం చేసిన నితీష్ కుమార్ రెడ్డి.. ఒకవేళ తన జీవిత భాగస్వామిని ఎంచుకోవాల్సి వస్తే ఆమెకు ఉండాల్సిన లక్షణాలను వివరించాడు. తన వృత్తి అయిన క్రికెట్ పట్ల ఆమెకు కనీస అవగాహన ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించాడు. క్రికెటర్ల జీవితంలో ఉండే ఒడిదుడుకులు, ఒత్తిడిని అర్థం చేసుకుని, కష్టసుఖాల్లో తోడుగా ఉండే మనస్తత్వం ఉన్న అమ్మాయి అయితే బాగుంటుందని తన మనసులోని మాటను బయటపెట్టాడు.అయితే అందరినీ ఆశ్చర్యపరిచిన విషయం ఏమిటంటే.. నితీష్ కుమార్ రెడ్డి తన కాబోయే భార్య ఉండాల్సిన



ఎత్తు గురించి చెప్పాడు. “నాకు కొంచెం ఎత్తు ఉన్న అమ్మాయిలంటే ఇష్టం. సుమారు 5’7” నుంచి 5’8” వరకు ఎత్తు ఉంటే నా పక్కన చూడటానికి జోడీ బాగుంటుంది” అని నితీష్ కుమార్ రెడ్డి నవ్వుతూ చెప్పాడు. సాధారణంగా క్రికెటర్లు తమ ఫిట్‌నెస్ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటారో.. నితీష్ తన భాగస్వామి విషయంలో కూడా అంతటి స్పష్టతతో ఉండటం విశేషం.నితీష్ తన అభిప్రాయాన్ని మరింత సరదాగా వివరిస్తూ.. తనకు ఎత్తు ఉన్న అమ్మాయిలే ఎందుకు ఇష్టమో కూడా చెప్పాడు. “ఆమె సహజంగానే ఎత్తుగా ఉంటే, మళ్లీ ప్రత్యేకంగా హై-హీల్స్ వేసుకోవాల్సిన అవసరం ఉండదు. ఆ ఒక్క క్వాలిటీ ఉన్నా నాకు సరిపోతుంది” అని చమత్కరించాడు. నితీష్ చేసిన ఈ సరదా కామెంట్లు నెటిజన్లను, ముఖ్యంగా మహిళా అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తన కెరీర్ ఆరంభంలోనే ఆటపై ఎంతటి ఏకాగ్రతతో ఉన్నాడో, వ్యక్తిగత విషయాల్లోనూ అంతే క్లారిటీతో ఉన్నాడంటూ ఫ్యాన్స్ ప్రశంసలు కురిపిస్తున్నారు.

## గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు భారీ జరిమానా!

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై థ్రిల్లింగ్ విక్టరీ తర్వాత గుజరాత్ టైటాన్స్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ బిగ్ షాక్ ఇచ్చింది. ఈ మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ మెయింటెన్ చేసినందుకు గాను శుభ్‌మన్ గిల్‌కు భారీ జరిమానా విధించారు. వరుస పరాజయాల తర్వాత మొదటి విజయం అందుకున్నామన్న ఆనందంలో ఉన్న గుజరాత్ టైటాన్స్ జట్టుకు ఇది కొంత చేదు వార్త అనే చెప్పాలి.ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన ఈ హై-స్కోరింగ్ మ్యాచ్‌లో ఢిల్లీ బ్యాటర్ డేవిడ్ మిల్లర్ ఆఖర్లో విరుచుకుపడటంతో మ్యాచ్ ఉత్కంఠగా మారింది. డేవిడ్ మిల్లర్ ధాటికి బౌలర్లు, కెప్టెన్ వ్యూహాలు మార్చుకోవాల్సి రావడం, ఫీల్డింగ్ సెట్ చేయడంలో జాప్యం జరగడంతో ఇన్నింగ్స్ నిర్ణీత సమయం కంటే ఆలస్యమైంది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం.. ఇది ఈ సీజన్‌లో గుజరాత్ జట్టు చేసిన మొదటి తప్పిదం కావడంతో కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించినట్లు ఐపీఎల్ కమిటీ ఓ ప్రకటనలో వెల్లడించింది.ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్(70), జోస్ బట్లర్(52), వాషింగ్టన్ సుందర్(55) అద్భుత అర్ధ సెంచరీలతో 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కేఎల్ రాహుల్ 92 పరుగులతో అదరగొట్టినప్పటికీ.. మిగిలిన బ్యాటర్ల నుంచి ఆశించిన సహకారం అందలేదు. అయితే చివరి నిమిషంలో డేవిడ్ మిల్లర్ 20 బంతుల్లో 41 పరుగులు చేసి ఢిల్లీని విజయతీరాలకు చేర్చినంత పనిచేశాడు.చివరి ఓవర్‌లో ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేసి కేవలం ఒకే ఒక్క పరుగు తేడాతో గుజరాత్ టైటాన్స్ జట్టుకు విజయాన్ని అందించాడు. ఆఖరి 2 బంతుల్లో 2 పరుగులు కావాల్సిన సమయంలో డేవిడ్ మిల్లర్ సింగిల్ తీయడానికి నిరాకరించడం.. చివరి బంతికి కుల్దీప్ యాదవ్ రనౌట్ అవ్వడం మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఈ మ్యాచ్‌లో 4 ఓవర్లలో కేవలం 17 పరుగులిచ్చి 3 కీలక వికెట్లు తీసిన రషీద్ ఖాన్ ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్’ అవార్డును గెలుచుకున్నారు. పాయింట్ల పట్టికలో ఈ గెలుపుతో గుజరాత్ తన ఖాతా తెరిచింది.



## అఫ్ఘాన్ క్రికెట్ అభిమానులకు షాక్.. రషీద్ ఖాన్ రిటైర్‌మెంట్!



అఫ్ఘానిస్థాన్ స్పిన్ మాంత్రికుడు రషీద్ ఖాన్‌కి అతడి దేశంలోనే కాదు.. భారత్‌లో కూడా చాలా మంది అభిమానులు ఉన్నారు. ముఖ్యంగా ఐపిఎల్‌లో రషీద్ బౌలింగ్‌ని ఇష్టపడే వాళ్లు చాలా మంది ఉన్నారు. అయితే రషీద్ ఖాన్ తాజాగా తన అభిమానులకు షాక్ ఇచ్చాడు. తాను టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్ అవుతున్నట్లు సంకేతాలు ఇచ్చాడు. బుధవారం ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో? గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడిన రషీద్ అద్భుత ప్రదర్శన (3/17) చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. అనంతరం రషీద్ మాట్లాడుతూ.. తాను టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకోవచ్చున్న సంకేతాన్ని ఇచ్చాడు.  అయినా సరే నేను ఆడాను. గతేడాది జింబాబ్వేతో జరిగిన టెస్ట్ మ్యాచ్‌లో 67 ఓవర్లు బౌలింగ్ చేశాను. దీంతో ఇది నా ఆరోగ్యంపై ప్రభావం చూపించింది. నేను ఓ టెస్ట్ మ్యాచ్‌లో ఇన్ని ఓవర్లు వేశానని తెలిసి డాక్టర్లు షాక్ అయ్యారు. ఇకపై టెస్టులు ఆడే సాహసం చేస్తే.. ఎక్కువ కాలం క్రికెట్‌లో కొనసాగలేనని హెచ్చరించారు” అని వెల్లడించాడు. మరిన్ని కనుగొనండి సినిమా టిక్కెట్లు ఆన్‌లైన్ వార్తల సబ్‌స్క్రిప్షన్ వీడియో వార్తలు రషీద్ 2023 వన్డే ప్రపంచకప్ కోసం శస్త్ర చికిత్స వాయిదా వేసుకున్నాడు. ఆ తర్వాత యుకెలో సర్జరీ చేయించుకొని 2024లో తిరిగి వచ్చాడు. ఆ తర్వాత వరుసగా ఫ్రాంచైజీ క్రికెట్ ఆడటం వల్ల గాయాలు తిరగబెట్టాయి. ఫలితంగా కొంతకాలం ఫామ్ కోల్పోయి ఇబ్బందులు పడ్డాడు. ఇక అఫ్ఘానిస్థాన్‌కు 2017లో టెస్ట్ క్రికెట్ హోదా వచ్చింది. అప్పటినుంచి ఆ జట్టు 12 టెస్టులు ఆడగా.. అందులో రషీద్ 6 టెస్టుల్లో పాల్గొన్నాడు. ఈ 6 మ్యాచుల్లో 45 వికెట్లు తీశాడు.

## సింగిల్ వివాదం.. మిల్లర్‌కు భారత్ క్రికెట్ దిగ్గజం అండ...



న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ ?గ్ 19వ సీజన్‌లో? =బుధవారం ఉత్కంఠభరితమైన మ్యాచ్ జరిగింది. ఢిల్లీ కృపిటల్స్‌తో జరిగిన హోరాహోరీ పోరులో గుజరాత్ కేవలం 1 పరుగు తేడాతో విజయం సాధించింది. అయితే ఈ మ్యాచ్‌లో జరిగిన ఓ ఘటన ఇప్పుడు పెద్ద చర్చకు దారి తీసింది. మ్యాచ్ చివరి ఓవర్‌లో ఢిల్లీ ఆటగాడు డేవిడ్ మిల్లర్ సింగిల్‌కు నిరాకరించడంపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే మిల్లర్‌కు టీం ఇండియా క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ అండగా నిలిచారు.  వ్యాపార కోర్సులు “ఢిల్లీ ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్ ఐదో బంతికి మిల్లర్ సింగిల్ తీసి కుల్దీప్ యాదవ్‌కి స్ట్రైక్ ఇవ్వాల్సింది. అదే తెలివైన నిర్ణయం అని మ్యాచ్ తర్వాత మనకు అనిపిసుంది. కానీ, వాస్తవాలను ఆలోచిస్తే మిల్లర్ చివరి ఓవర్, అంతకుముందు ఓవర్లోనూ భారీ షాట్లు ఆడాడు. చివరి బంతిని కూడా అలా ఆడగలనని అతడు నమ్మకంగా ఉన్నాడు. కానీ, పరిస్థితులు అనుకూలించలేదు. గుజరాత్ బౌలర్ ప్రసిద్ధ్ కృష్ణ అద్భుత డెలివరీతో మిల్లర్‌కు షాట్ ఆడటం సాధ్యపడలేదు. దీంతో దిల్లీకి ఓటమి తప్పలేదు. అయితే, సింగిల్ తీయకుండా ఉన్నందుకు ఇక్కడ మిల్లర్‌ను నిందించాల్సిన అవసరం లేదు” గవాస్కర్ విశ్లేషించారు.


## క్వార్టర్ ఫైనల్లో ఆయుశ్.. తొలి రౌండ్‌లోనే సింధు, ప్రణయ్ ఇంటికి..!

భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి అదుర్స్ అనిపించాడు. ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ లో సీనియర్లు తేలిపోగా.. ఈ కుర్రాడు మాత్రం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం చీ యు జెన్(చైనీస్ తైపీ)ను చిత్తు చేసిన ఆయుశ్ టైటిల్‌పై ఆశలు రేపుతూ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌హెచ్ ప్రణయ్ చేతెలెత్తేయగా.. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు సైతం మొదటి రౌండ్‌లో ఓటమితో ఇంటిదారి పట్టింది.చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో గురువారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు తొలి రౌండ్‌లో, హెచ్‌ఎస్ ప్రణయ్ క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించారు.ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఆడలేకపోయిన సింధు ఈ టోర్నీలో మెరుస్తుందనుకుంటే.. వరల్డ్ నంబర్ 2 ధాటికి మొదటి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. రెండు సెట్లలో పోరాడిన తెలుగు తేజాన్ని వాంగ్ జీ యీ 21-18, 21-18తో మట్టికరిపించింది. తొలి రౌండ్‌లో అదరగొట్టిన ప్రణయ్‌ను చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్ 21-12, 21-19తో సులువుగా ఓడించాడు.సీనియర్లు విఫలమైన చోట ఇరవై ఏళ్ల ఆయుశ్ ప్రత్యర్థికి దడ పుట్టించాడు. తొలి రౌండ్‌లోనే ఏడో ర్యాంకర్ చైనా ఆటగాడిని ఇంటికి పంపిన ఆయుశ్ ఈసారి 25వ ర్యాంకరైన చీ యూ జెన్(చైనీస్ తైపీ)ను వణికించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం చెలాయించిన భారత కుర్రాడు.. 21-16, 21-12తో గెలుపొందాడు. క్వార్టర్స్‌లో అతడికి మూడో సీడ్ జోనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా) ఎదురుపడనున్నాడు. ఆయుష్ సెమీస్ చేరాలంటే జోనాథన్ వ్యూహాలను చిత్తు చేయాల్సిందే.






# పవన్ కు ఇష్టమైన ఫుడ్ ఏంటి? అన్నాకు వంట వచ్చా?




పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సతీమణి అన్నా లెజినోవా ఇటీవల సోషల్ మీడియాలోకి అడుగుపెట్టిన తర్వాత ఫుల్ యాక్టివ్ గా ఉంటున్నారు. తక్కువ సమయంలో ఆమెకు మంచి ఫాలోయింగ్ రావడం గమనార్హం. మెగా ఫ్యామిలీకి సంబంధించిన ఫోటోలు, స్పెషల్ మూమెంట్స్ అభిమానులతో పంచుకుంటూ ఆమె నెటిజన్లకు మరింత దగ్గరవుతున్నారు. తాజాగా ఆమె తన ఇన్ స్టాగ్రామ్ లో చిట్ చాట్ నిర్వహించి అందరి దృష్టిని ఆకర్షించారు. చిట్ చాట్ లో అభిమానులు అడిగిన ప్రశ్నలకు అన్నా లెజినోవా ఎంతో ఓపెన్ గా, కూల్ గా సమాధానాలు ఇచ్చారు. ముఖ్యంగా ఆమె వంటకు సంబంధించిన విషయాలు నెటిజన్లను ఆకట్టుకున్నాయి. 'మీకు వంట చేయడం వచ్చా?' అనే ప్రశ్నకు స్పందిస్తూ, 'మా అత్తమ్మ దగ్గర నేను చాలా వంటలు నేర్చుకున్నాను. దోస, ఇడ్లీ, చట్నీ, కర్రీలు, పప్పులు, ఫిష్ పులుసు, గోంగూర, పాలక్ పన్నీర్, ప్రాన్స్ ఇగురు, బిర్యానీ ఇలా ఎన్నో వంటకాలు చేయడం నేర్చుకున్నాను. ముఖ్యంగా వెజ్ వంటలు ఎక్కువగా నేర్చుకున్నా' అని తెలిపారు. ఇక మరో అభిమాని పవన్ కళ్యాణ్ కు ఇష్టమైన ఆహారం గురించి ప్రశ్నించగా, ఆమె ఆసక్తికర సమాధానం ఇచ్చారు. 'మా అత్తమ్మ చేసే మసాలా చికెన్ కర్రీ అంటే ఆయనకు చాలా ఇష్టం. ఆ వంటను నేను కూడా ఆమె దగ్గర నేర్చుకున్నాను. అలాగే ఆయన వదినమ్మ సురేఖ చేసే చేపల పులుసు కూడా ఆయన ఎంతో ఇష్టంగా తింటారు' అని వెల్లడించారు. ఈ సమాధానాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అన్నా లెజినోవా ఇన్ స్టాగ్రామ్ లో యాక్టివ్ అవుతున్నప్పటి నుంచి మెగా అభిమానుల్లో మంచి క్రేజ్ ఏర్పడింది. ఆమె పోస్టులు కేవలం ఫోటోలకే పరిమితం కాకుండా, కుటుంబానికి సంబంధించిన చిన్న చిన్న విషయాలను కూడా పంచుకుంటుండటం అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. మెగా ఫ్యామిలీకి కోడలిగా మాత్రమే కాకుండా, తన ప్రత్యేకతను చూపించేలా ఆమె సోషల్ మీడియాలో తనదైన స్టైల్ లో ముందుకు సాగుతున్నారు. అలాగే జనసేన కార్యకర్తలు కూడా ఆమెను పెద్ద ఎత్తున ఫాలో అవుతున్నారు. కుటుంబానికి సంబంధించిన విషయాలు, వ్యక్తిగత అనుభవాలు, రోజువారీ జీవితానికి సంబంధించిన అప్డేట్స్ షేర్ చేస్తూ ఆమె తన ఫాలోవర్స్ తో మంచి అనుబంధాన్ని ఏర్పరుచుకుంటున్నారు. అభిమానులతో నేరుగా మాట్లాడటం, వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ద్వారా ఆమె మరింత చేరువవుతున్నారు. ప్రస్తుతం అన్నా లెజినోవా చిట్‌చాట్ సోషల్ మీడియాలో హాట్ టాపిక్ గా మారింది. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ కు ఇష్టమైన వంటకాల గురించి ఆమె చెప్పిన విషయాలు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారాయి. ఏదేమైనా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులతో మమేకమవుతున్న అన్నా.. మెగా ఫ్యాన్స్ కు మరింత దగ్గరవుతూ తనకంటూ ప్రత్యేక స్థానం ఏర్పరుచుకుంటున్నారు. ఆమె చేసే ప్రతి పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతూ.. అభిమానుల ఆసక్తిని పెంచుతోంది.

# నాని కెరీర్‌లోనే ఫాస్టెస్ట్ హిట్.. ఆయా షేర్ హిస్టరీ!

నేచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా సినిమా ది ప్యారడైజ్ మరోసారి ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ఈ సినిమాలోని ఫస్ట్ సింగిల్ ఆయా షేర్ రిలీజైన కొద్ది రోజుల్లోనే అద్భుతమైన రికార్డును సొంతం చేసుకుంది. ఈ పాట 100 మిలియన్ వ్యూస్‌ను అత్యంత వేగంగా చేరుకోవడం ద్వారా నాని కెరీర్‌లో కొత్త మైలురాయిగా నిలిచింది. గతంలో నాని సినిమాలకు వచ్చిన సాంగ్స్ కంటే ఈ సాంగ్ అత్యంత వేగంగా ఈ ఫీట్ సాధించడం విశేషం. మాస్ లో పెరిగిన నాని ఇమేజ్ ఈ సాంగ్ లో నాని కనిపించిన రగ్గడ్ అవతార్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. జడల్ అనే పాత్రలో ఆయన చేసిన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్, ఎనర్జిటిక్ డాన్స్ మూమెంట్స్ అభిమానులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. సోషల్ మీడియాలో ఈ పాటకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే, నాని మాస్ ఇమేజ్ మరింతగా బలపడిందని స్పష్టంగా తెలుస్తోంది. ముఖ్యంగా యూత్ లో ఈ సాంగ్ భారీగా వైరల్ అవుతూ రీల్స్ రూపంలో ట్రెండ్ అవుతోంది.సక్సెస్ ఫార్ములాగా నాని- అనిరుధ్ కాంబో మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ మరోసారి ఈ సాంగ్ తో తన మ్యాజిక్‌ను చూపించారు. గతంలో అతను అందించిన హిట్ సాంగ్స్ సరసన ఆయా షేర్ కూడా నిలిచిపోయేలా ఉంది. ఈ సాంగ్ బీట్, ఎనర్జీ, మరియు మాస్ ఫీలింగ్ ప్రేక్షకులను థియేటర్లలో ఉర్రూతలూగించేలా ఉండబోతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. నాని- అనిరుధ్ కాంబినేషన్ లో ఇప్పటికే పలు హిట్ సాంగ్స్ రాగా, ఇప్పుడు మరోసారి ఈ కాంబినేషన్ సక్సెస్ ఫార్ములాగా మారిందని ఆయా షేర్ సాంగ్ ప్రూవ్ చేసింది. ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్ తో.. డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల ఈ సాంగ్‌ను భారీ స్థాయిలో తెరకెక్కించారు. విజువల్స్ పరంగా ఈ సాంగ్ లో కనిపించే గ్రాండియర్ సినిమాపై ఉన్న అంచనాలను మరింత పెంచుతోంది. ప్రతి ఫ్రేమ్‌లో కనిపించే మాస్ ఎలిమెంట్స్, రా ఎనర్జీ, మరియు డార్క్ టోన్ సినిమా థీమ్‌ను బలంగా




ప్రతిబింబిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్‌పై ఆయన పెట్టిన కృషి స్పష్టంగా కనిపిస్తోంది. నిర్మాత సుధాకర్ చెరుకూరి ఎలాంటి రాజీ పడకుండా భారీ బడ్జెట్‌తో ఈ సాంగ్‌ను తెరకెక్కించినట్టు తెలుస్తోంది. ప్రొడక్షన్ విల్యూస్ ప్రతి షాట్‌లో కనిపిస్తూ సినిమాకు రిచ్ లుక్‌ను తీసుకువచ్చాయి. ఈ స్థాయి నిర్మాణం సినిమాపై ఉన్న ఆసక్తిని మరింతగా పెంచుతోంది. . నెటిజన్లు ఫుల్ ఫైర్! ఇవి మాత్రమే కాకుండా ది ప్యారడైజ్ కాస్టింగ్ కూడా ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మోహన్ బాబు, రాఘవ జుయాల్, సంపూర్ణేశ్ బాబు లాంటి నటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ విభిన్నమైన కాంబినేషన్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా మారింది. మొత్తానికి ఆయా షేర్ సాంగ్ సాధించిన 100 మిలియన్ వ్యూస్ ఫీట్ సినిమా ప్రమోషన్స్‌కు భారీ బూస్ట్ ను ఇచ్చింది. ఈ సాంగ్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు మరింతగా పెరిగాయి. ప్రపంచవ్యాప్తంగా 8 భాషల్లో ఆగస్టు 21, 2026న విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# విజయ్- రష్మిక మరో వేడుక.. ఎందుకంటే..



టాలీవుడ్ లో క్రేజీ కపుల్ గా గుర్తింపు పొందిన విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న ఈ ఏడాది వివాహ బంధంలోకి అడుగుపెట్టి అభిమానులను సర్ప్రైజ్ చేసిన విషయం తెలిసిందే. కొన్నేళ్లుగా సీక్రెట్ గా కొనసాగిన వారి రిలేషన్ షిప్ కు ఫుల్ స్టాప్ పెడుతూ ఫిబ్రవరి 26వ తేదీన రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో అత్యంత ప్రైవేట్ గా పెళ్లి చేసుకున్నారు. కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరైన ఆ వేడుక సింపుల్‌గా జరిగినప్పటికీ, తర్వాత హైదరాబాద్ లో గ్రాండ్ రిసెప్షన్ ఏర్పాటు చేసి సందడి చేశారు. పెళ్లి అనంతరం రీసెంట్ గా రష్మిక తన తొలి పుట్టినరోజు కుటుంబ సభ్యుల సమక్షంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా దంపతులు కర్ణాటకలోని ఓ ప్రసిద్ధ ఆలయాన్ని సందర్శించడం కూడా చర్చనీయాంశమైంది. ఆ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారి అభిమానులను ఆకట్టుకున్నాయి. ఇదిలా ఉండగా.. తాజాగా ఈ జంట మరోసారి రిసెప్షన్ వేడుక నిర్వహించుకోవడం ఆసక్తికరంగా మారింది. రష్మిక నేటివ్ విలేజ్ కూర్గ్ లోని విరాజ్ పేట్ లో కుటుంబ సభ్యులు, బంధువుల కోసం ప్రత్యేకంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కొడవ సంప్రదాయాల మధ్య జరిగిన ఆ వేడుకలో స్థానిక సంస్కృతి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రిసెప్షన్ లో రష్మిక సంప్రదాయ కొడవ దుస్తుల్లో మెరిసిపోగా, విజయ్ దేవరకొండ కూడా స్థానిక స్టైల్ లో కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు. వేడుకకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారి అభిమానులను ఆకట్టుకున్నాయి. ఫంక్షన్ హాల్ ను సంప్రదాయ అలంకరణలతో తీర్చిదిద్దడం వేడుకకు మరింత గ్రాండ్ నెస్ తీసుకువచ్చింది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. తాను కూర్గ్ కు రావడం ఇది మూడోసారి అని వెల్లడించారు. రష్మికను కలిసే ముందు కూడా ఇక్కడికి వచ్చినట్లు గుర్తు చేసుకున్నారు. స్కూల్ రోజుల్లో స్నేహితులతో కలిసి వచ్చిన అనుభవాలను ఆయన చెప్పుకొచ్చారు. కూర్గ్ ప్రకృతి అందాలు తనకు ఎంతో ఇష్టమని, ఇక్కడి మహిళలు చాలా అందంగా ఉంటారని సరదాగా వ్యాఖ్యానించారు. 'నేను కూర్గ్ అమ్మాయినే పెళ్లి చేసుకున్న' అంటూ చెప్పడం అక్కడున్న వారిని అలరించింది. పెళ్లి వేడుకకు హాజరు కాలేకపోయిన బంధువుల కోసం రిసెప్షన్ ఏర్పాటు చేసినట్లు సమాచారం. కేవలం ఆహ్వానితులకు మాత్రమే అనుమతి ఉండగా, మీడియాకు ప్రవేశం ఇవ్వకుండా పూర్తి ప్రైవసీతో కార్యక్రమాన్ని నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లు కూడా కట్టుదిట్టంగా చేశారు. ఏదేమైనా రిసెప్షన్ వేడుకతో మరోసారి వార్తల్లో నిలిచిన విజయ్- రష్మిక జంట, తమ కొత్త జీవితం ఆనందంగా సాగిస్తుండడం అభిమానులకు మరింత సంతోషాన్ని కలిగిస్తోందని చెప్పాలి.





# అడివి శేష్ తో లిటిల్ హార్ట్స్ డైరెక్టర్.. ఏంటీ కాంబో?

టాలీవుడ్ లో తక్కువ బడ్జెట్ తో పెద్ద విజయాన్ని అందుకోవచ్చని నిరూపించిన దర్శకుడు సాయి మార్తాండ్ ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్ తో వార్తల్లో నిలిచారు. లిటిల్ హార్ట్స్ సినిమాతో ఒక్కసారిగా ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన ఆయన, తన తదుపరి సినిమాను అధికారికంగా ప్రకటించారు. టాలెంటెడ్ హీరో అడివి శేష్ తో వర్క్ చేయనున్నట్లు రివీల్ చేశారు. కేవలం రెండు కోట్ల రూపాయల బడ్జెట్ తో రూపొందిన లిటిల్ హార్ట్స్ చిత్రం బాక్సాఫీస్ వద్ద సుమారు 30 కోట్లకు పైగా వసూళ్లను సాధించి ఘన విజయాన్ని అందుకుంది. ఈ విజయంతో సాయి మార్తాండ్ పేరు టాలీవుడ్ లో హాట్ టాపిక్‌గా మారింది. అప్పటి నుంచి పలువురు హీరోలతో ఆయన సినిమా చేయనున్నట్లు వార్తలు వినిపించాయి. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన డెకాయిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సాయి మార్తాండ్ కీలక ప్రకటన చేశారు. తన తదుపరి చిత్రం హీరో అడివి శేష్ తోనే ఉండబోతుందని వెల్లడించారు. ప్రస్తుతం శేష్ చేస్తున్న గూఢచారి 2 పూర్తయ్యాక ఆ ప్రాజెక్ట్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా సాయి మార్తాండ్ తన అభిమానం, ప్రయాణం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదేళ్ల క్రితం తాను ఇంటర్ చదువుతున్నప్పుడు క్షణం సినిమా చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు. "తక్కువ బడ్జెట్ తో కూడా ఇంత క్వాలిటీతో థ్రిల్లర్ ఎలా తీస్తారో అనిపించింది. అప్పటినుంచే శేష్ అన్న నాకు ఇన్స్పిరేషన్" అని తెలిపారు. తాను కూడా అదే మార్గంలో లిటిల్ హార్ట్స్ చిత్రాన్ని రూపొందించానని చెప్పారు.



అంతేకాకుండా, తన సినిమా సక్సెస్ ఈవెంట్ కు అడివి శేష్ గెస్ట్ గా రావడం, తనతో కలిసి డ్యాన్స్ చేయడం, పాట పాడడం వంటి విషయాలను గుర్తు చేసుకున్నారు.' చక్రం లాంటిది. నేను అభిమానిగా చూసిన వ్యక్తి, ఇప్పుడు నా సినిమా వేడుకకు వచ్చి నాతో కలిసి ఎంజాయ్ చేయడం ఎంతో ఆనందంగా అనిపించింది" అని అన్నారు. ఇంకా, ఆ కొత్త ప్రాజెక్ట్ ఒక లవ్ స్టోరీగా ఉండబోతుందని సాయి మార్తాండ్ స్పష్టం చేశారు. ఇప్పటివరకు థ్రిల్లర్, సస్పెన్స్ కథలతో గుర్తింపు తెచ్చుకున్న అడివి శేష్ లవ్ స్టోరీకి ఓకే చెప్పడం ఇండస్ట్రీలో ఆసక్తి రేకెత్తిస్తోంది. ఆ కాంబినేషన్ కొత్తగా ఉండటంతో ప్రేక్షకుల్లోనూ మంచి ఆసక్తి నెలకొంది. ఆ చిత్రానికి నిర్మాతలుగా జగపతి బాబు, సునీల్ నారంగ్ వ్యవహరించనున్నారు. వీరిద్దరూ కలిసి ఒక ప్రాజెక్ట్ ను నిర్మించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ముఖ్యంగా జగపతి బాబు గతంలోనే సాయి మార్తాండ్ తో సినిమా చేయాలని చెప్పి మాట ఇచ్చినట్లు దర్శకుడు గుర్తుచేశారు. మొత్తానికి.. సాయి మార్తాండ్- అడివి శేష్ కాంబినేషన్ లో రాబోయే లవ్ స్టోరీ చిత్రం టాలీవుడ్ లో ప్రత్యేక ఆకర్షణగా మారింది.

Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**